VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : గురువారం 23.07.2026
సంపుటి : 09 సంచిక : 44 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH
www.velthuru.com




## అక్రమాలకు నిలయంగా విద్యా వ్యవస్థ

- కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ధ్వజం
- మన దేశ నేడు తీవ్ర సంక్షోభంలో విద్యా వ్యవస్థ

# నన్ను దెబ్బ తీసేందుకు కుట్ర

- బీఆర్ఎస్, బీజేపీలపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- కొడంగల్‌లో నన్ను రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్రలు
- రాష్ట్ర ప్రజలే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపు
- రాష్ట్ర స్థాయి దృష్టి మళ్లించేందుకే ఇక్కడ పొగబెడుతున్నారు
- కొడంగల్ పర్యటనలో ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు
- కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్ల తొలగిం పునకు కుట్రలు
- అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి
- భవిష్యత్తు రాజకీయం మహిళలదే
- స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు పెరగనున్న ఆధిపత్యం
- పురుషులు బాధ్యతగా పనిచేయకపోతే ఇళ్లకే పరిమితం
- రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్ట్‌పై నిరసన ర్యాలీ
- అంబేద్కర్ విగ్రహం వరకు సీఎం రేవంత్ పాదయాత్ర



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీల వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో తానను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఆ రెండు పార్టీలు లోపాయి కారీగా ఒక్కటయ్యాయని సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్ పర్యటనలో భాగంగా రెండో రోజు మాట్లాడిన సీఎం, బీఆర్ఎస్, బీజేపీ సిద్ధాంతాలు వేరైనా, తన్ను రాజకీయంగా అనగదొక్కాలనే ప్రధాన లక్ష్యం మాత్రం వారిద్దరికీ ఒక్కటేనని ధ్వజమెత్తారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను, విపక్షాల తప్పులను తాను నిలదీస్తున్నందుకే తనపై ఈ తరహా కుట్రలకు తెరలేపారని మండిపడ్డారు.రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం తాను రోజుకు 18 గంటల పాటు నిరంతరం కష్టపడుతున్నా సమయం సరిపోవడం లేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కొడంగల్‌లో తనను నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక, స్థానికంగా ఇబ్బందులు సృష్టిస్తే తన ఫోకస్ అంతా ఇక్కడే ఉండిపోతుందని విపక్షాలు భావిస్తున్నాయన్నారు. కొడంగల్‌లోనే తనను కట్టిపడేస్తే రాష్ట్రస్థాయిలో పాలనపై దృష్టి పెట్టలేడని భావించి ఇక్కడ పొగబెడుతున్నారని విమర్శించారు. అయితే కొడంగల్‌లో తనకోసం ప్రాణమిచ్చే కాంగ్రెస్ సైనికులు ఉన్నారని, వారి ముందు ప్రత్యర్థుల కుట్రలు, కుతంత్రాలు ఏమాత్రం సాగవని ధీమా వ్యక్తం చేశారు.కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసిన పేద ప్రజల ఓట్లను దొంగతనంగా తొలగించేందుకు బీఆర్ఎస్, బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని సీఎం ఆరోపించారు. తనకు రాజకీయంగా అండగా నిలిచి, గెలిపించిన కొడంగల్ ప్రజలే ఈ కుట్రదారులను క్షేత్రస్థా యిలోనే తిప్పికొట్టాలని, పొలిటికల్‌గా బొందపెట్టాలని పిలు పునిచ్చారు.

▶ మిగతా 2లో

## రాహుల్ గాంధీ, కాంగ్రెస్ డ్రామాలు మాని పార్లమెంట్‌కు రావాలి: కేంద్ర మంత్రి బండి సంజయ్



**న్యూఢిల్లీ వెలుతురు జూలై 22:**

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న ధర్నాలు మరియు రాజకీయ పరిణామాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయ డ్రామాలతో ప్రజల దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ నేతలు ధర్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ ను ప్రతిపక్ష పార్టీగా కూడా గుర్తించడం లేదని, కాక్రోచ్ పార్టీతో పోటీ పడేందుకే ఆ పార్టీ ధర్నాలు చేస్తున్నట్లుందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

▶ మిగతా 2లో

## మరింత పెరగనున్న విద్యుత్ వినియోగం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి
- హనుమకొండలో కీలక సమీక్ష
- ఎల్ నినో ప్రతికూల ప్రభావాలు
- 7 వేల మెగావాట్ల అదనపు భారం
- అయినా తట్టుకున్న డిస్కంలు
- రాష్ట్రంలో 'పవర్ కట్స్' లేవు
- తాత్కాలిక అంతరాయాలేనని స్పష్టత
- వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన డిమాండ్
- 16,500 మెగావాట్లకు చేరిన విద్యుత్ వినియోగం




రాష్ట్రంలో 'ఎల్ నినో' వల్ల ఏర్పడిన తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులను, దానివల్ల పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్ధ వంతంగా ఎదుర్కొందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.



## అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- ఎస్ఐఆర్ కమిటీతో సమీక్షించిన కేటీఆర్..
- ఓటర్ల జాబితా సవరణపై కీలక దిశానిర్దేశం
- బూత్ స్థాయి వరకు సమన్వయంతో యజ్ఞంలా పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు

**హైదరాబాద్:**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్క ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని, ఏ ఒక్కరి పేరు కూడా విడిపోకుండా నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్) పార్టీ శ్రేణులకు సూచించారు.

▶ మిగతా 2లో

## నీట్ రద్దుతోనే సమస్యకు పరిష్కారం

- తమిళనాడు సీఎం విజయ్ తీవ్ర వ్యాఖ్యలు
- ఢిల్లీలో విపక్ష నేతల అరెస్ట్‌పై నిరసన జ్వాలలు
- నీట్‌ను వెంటనే రద్దు చేయాలని విజయ్ డిమాండ్




- విద్యార్థుల, ప్రజల మనోభా వాలను గౌరవించాలని హితవు

## తెలంగాణ ప్రభుత్వానికి గుడ్ న్యూస్

**ఢిల్లీ వెలుతురు జూలై 22:**

రబీ సీజన్ కు సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నులు(బియ్యం రూపంలో) పెంచేందుకు ఆమోదం తెలిపిన కేంద్రం.సవరించిన వరి కొనుగోలు అంచనా బియ్యం రూపంలో 43.00 లక్షల మెట్రిక్ టన్నులు (LMT) గా నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వం.రాష్ట్ర వ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ (Vehicle Location Tracking System – VLTS)ను 2026 సెప్టెంబర్ 30 లోపు పూర్తిగా అమలు చేయాలని నిర్ధారించిన కేంద్రంపార్లమెంట్ లో ఆహార



& ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వద్ద కొనుగోలు అంచనాను పెంచినందుకు ధన్యవాదాలు తెలిపిన బండి సంజయ్

## బిఆర్ఎస్ పాలనలో ప్రజల గోడు వినేవారే లేరు




- ప్రతివారం గాంధీభవన్‌లో ప్రజలతో మంత్రుల ముఖాముఖి
- క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి
- ప్రధాని మోదీ, విద్యామంత్రి ప్రధాన్ రాజీనామా చేయాలి

## తెలంగాణ రెడ్కో డీఈ ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులు న్నాయనే ఆరోపణలతో తనిఖీలు
- హైదరాబాద్‌లోని నివాసంతో పాటు 15 ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు
- స్థిర, చరాస్తుల పత్రాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం




**హైదరాబాద్, వెలుతురు, జూలై 22:**

తెలంగాణ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో) డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ నివాసంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు.

## అక్రెడిటేషన్ల దందా: జర్నలిజం గౌరవానికా, వ్యాపారానికా? పాపని నాగరాజు



**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**

ప్రజాస్వామ్యంలో పత్రికలు, వార్తామాధ్యమాలు కేవలం వార్తలను చేరవేసే సాధనాలు కావు. అవి ప్రజలకు ప్రభుత్వానికి, సమాజానికి రాజ్యాంగానికి మధ్య వారధిగా ఉండే చైతన్య వేదికలు. పాలకులను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడం, ప్రజాభిప్రాయాన్ని నిర్మించడం మీడియా యొక్క చారిత్రక బాధ్యత. అలాంటి పవిత్ర వృత్తిలో అక్రెడిటేషన్ అనేది కేవలం గుర్తింపు కార్డు కాదు.

▶ మిగతా 2లో

## పార్లమెంట్‌లో మాట్లాడనివ్వడం లేదు

- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ
- పార్లమెంట్‌ను అప్రజాస్వామికంగా నడుపుతున్నారని విమర్శలు
- విద్యార్థులపై లాఠీఛార్జిని ఖండించిన ప్రియాంక, ఖర్గే..



- ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్నారని ఆరోపణ
- నల్ల దుస్తుల్లో పార్లమెంట్‌కు హాజరైన విపక్ష ఎంపీలు..

2

## ఉద్రిక్తంగా కాంగ్రెస్ 'చలో లోక్‌భవన్'

- హైదరాబాద్‌లో తీవ్ర ఉద్రిక్తత.. పీసీసీ చీఫ్, మంత్రుల అరెస్ట్!
- ఏఐసీసీ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసన జ్వాలలు
- హైదరాబాద్‌లో 'చలో లోక్‌భవన్' ముట్టడి



- నెక్లెస్ రోడ్డు నుంచి లోక్‌భవన్ వరకు సంకెళ్లతో ర్యాలీ
- పాల్గొన్న పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు

9

## అత్యవసర విచారణ కుదరదు

- సీజేపీ చలో సంసద్ లాఠీఛార్జి కేసు
- అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ**
- పోలీసు చర్యపై దాఖలైన పిటిషన్‌ను వెంటనే విచారించ



బోమన్న ధర్మాసనం

- కోర్టు సమయాన్ని వృథా చేయొద్దంటూ పిటిషనర్‌కు సీజేఐ సూచన

9

# పార్లమెంట్‌లో మాట్లాడనివ్వడం లేదు

- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

న్యూఢిల్లీ,వెలుతురు జూలై 20:

పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించడం లేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్‌ను అప్రజాస్వామికంగా నడుపుతున్నారని ఆరోపిస్తూ, ప్రజా సమస్యలను లేవనెత్తే ప్రతిపక్ష సభ్యుల గొంతును ప్రభుత్వం అణచివేస్తోందని అన్నారు. రోడ్లపై తమ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులతోనూ, పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులతోనూ కేంద్ర ప్రభుత్వం ఒకే విధమైన వైఖరిని అవలంబిస్తోందని మండిపడ్డారు.పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన ప్రియాంకా గాంధీ.. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జి చేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులకు సంఘీభావం తెలిపినందుకు తమను కూడా పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి తరలించారని ఆరోపించారు. తమపై ఎలాంటి చర్యలు తీసుకున్నా ఎదుర్కొంటామని, అయితే విద్యార్థుల హక్కులను కాలరాయడం, వారి న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోవడం ఏమాత్రం సమర్థనీయం కాదని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం కాకుండా నియంతృత్వ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో ఎంపీలను ప్రభుత్వం గౌరవించడం లేదని, ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష సభ్యులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.నిబంధనల ప్రకారం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులను పోలీసులతో కొట్టించడం దారుణమని ఖర్గే మండిపడ్డారు. అన్యాయాన్ని ప్రశ్నించకుండా విద్యార్థులు, ప్రతిపక్షాలను అడ్డుకోవడానికే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమ పోరాటాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే లక్షలాది మంది ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమిస్తారని హెచ్చరించారు.ఇదిలా ఉండగా, విద్యార్థులపై పోలీసుల చర్యలను నిరసిస్తూ ప్రతిపక్ష ఎంపీలు బుధవారం నల్ల దుస్తుల్లో పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా సహా పలువురు విపక్ష సభ్యులు పార్లమెంట్ వెలుపల నిరసన తెలిపారు. విద్యార్థులు లేవనెత్తుతున్న న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## రాహుల్ గాంధీ, కాంగ్రెస్ డ్రామాలు మాని పార్లమెంట్‌కు...

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని ఇంటి ముందు ధర్నా పేరుతో రాజకీయ డ్రామాలు చేశారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకే పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ బీజేపీ బ్రాండ్ అంబాసిడర్ అని, ప్రతిపక్ష నేతగా ఆయన ఉంటేనే బీజేపీకి రాజకీయంగా లాభమని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా కూడా జనం అంగీకరించడం లేదని, ఇక ఆయన ప్రధాని కావడం జరగని పని అని అన్నారు. రాహుల్ గాంధీ కాబోయే ప్రధాని అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం పెద్ద జోక్ అని, దేశంలో 'కాంగ్రెస్ ముక్త్ భారత్' కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. రాహుల్ పై దౌర్జన్యం చేశారనడంలో నిజం లేదని, ఆయనపై దౌర్జన్యం చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. నీట్ దోషులు ఎంతటి వారైనా కేంద్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే రాజకీయ డ్రామాలు మాని పార్లమెంట్ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల ధర్నాలు కూడా పెద్ద జోక్ అని బండి సంజయ్ విమర్శించారు. పొలాల్లో నారు ఎండిపోయి, ఎరువులు అందక రైతులు అల్లాడుతుంటే సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ఫెయిలైన కాంగ్రెస్ పై జనాగ్రహం పెల్లుబికుతోందని, ఆ ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే రేవంత్ సర్కార్ ధర్నాల పేరుతో కొత్త డ్రామాలకు తెరదీసిందని మండిపడ్డారు. ఇకనైనా డ్రామాలు కట్టిపెట్టి రైతుల పంటలకు సాగునీరందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## అక్రెడిటేషన్ల దందా: జర్నలిజం గౌరవానికా, వ్యాపారానికా? పాపని నాగరాజు

(మొదటి పేజీ తరువాయి)

అది పాత్రికేయుని వృత్తి నిబద్ధతకు, సామాజిక బాధ్యతకు, చట్టబద్ధ గుర్తింపుకు ప్రతీక.అయితే ప్రస్తుతం అక్రెడిటేషన్ వ్యవస్థ చుట్టూ నెలకొన్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అర్హులైన జర్నలిస్టులకు గుర్తింపు దక్కాల్సిన చోట, డబ్బు, పలుకుబడి, నకిలీ ధ్రువపత్రాలు వ్యవస్థను ఆక్రమిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది ఒక శాఖలోని పరిపాలనా లోపం మాత్రమే కాదు; జర్నలిజం విలువలనే ప్రశ్నించే సంక్షోభం.ఒక్క కాపీ కూడా ముద్రించని కొన్ని ఆన్లైన్ పత్రికలకు ఒక్కో జిల్లాలో 180 నుంచి 250 వరకు అక్రెడిటేషన్ కార్డులు జారీ కావడం చిన్న విషయం కాదు. అదే సమయంలో క్షేత్రస్థాయిలో నిజంగా పని చేస్తున్న జర్నలిస్టులు గుర్తింపుకోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిజమైన వృత్తి ప్రమాణాలు పక్కకు నెట్టబడి, అనుమానాస్పద సంస్థలు ప్రాధాన్యం పొందడం వ్యవస్థలోని అసమానతను బహిర్గతం చేస్తోంది.ఇంకా ఆందోళనకరమైన విషయం కార్డుల చుట్టూ ఏర్పడిన అక్రమ మార్కెట్ గురించిన ఆరోపణలు. రాష్ట్రస్థాయి కార్డుకు యాభై వేల రూపాయలు, జిల్లా స్థాయి కార్డుకు ముప్పై వేల రూపాయల వరకు బేరాలు జరుగుతున్నాయన్న ప్రచారం జర్నలిస్టు వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఈ ఆరోపణల్లో నిజం ఉంటే, అక్రెడిటేషన్ వృత్తి గుర్తింపు ప్రక్రియ నుంచి నేరుగా వ్యాపార లావాదేవీగా దిగజారినట్టే.ఇక్కడ కేవలం అధికారులు మాత్రమే కాదు, కొన్ని మీడియా యాజమాన్యాల పాత్ర కూడా ప్రశ్నించాల్సిందే. నకిలీ ధ్రువపత్రాలతో అక్రెడిటేషన్లు సాధించడం, ఒకే సంస్థకు అనుబంధంగా పలు పేర్లతో అదనపు కార్డులు పొందడం, వృత్తి నైతికతకు విరుద్ధం. పత్రికా సంస్థలు ప్రజాసేవ వేదికలుగా కాకుండా అవకాశాల వ్యాపార కేంద్రాలుగా మారితే, జర్నలిస్టు విలువ కూడా లాభనష్టాల లెక్కకు పరిమితమైపోతుంది.ఈ సంక్షోభానికి మరొక ప్రధాన కారణం అక్రెడిటేషన్‌ను ఎంపానెల్మెంట్‌తో ముడిపెట్టడం. ఒకప్పుడు జర్నలిస్టు వ్యక్తిగత వృత్తి ఆధారంగా గుర్తింపు పొందేవాడు. ఇప్పుడు అతను పని చేసే సంస్థ ప్రభుత్వ ఎంపానెల్లో ఉందా లేదా అన్నదే ప్రధాన ప్రమాణంగా మారింది. దీనివల్ల అసలు జర్నలిస్టు ప్రతిభ, అనుభవం, ప్రజా అనుబంధం రెండో స్థానానికి వెళ్లిపోయాయి.దీంతో పరిస్థితి ఎంతవరకు దిగజారిందంటే, అక్రెడిటేషన్ కార్డు సంపాదించడమే పెద్ద సవాలుగా మారింది. అంతేకాదు, కార్డు ఉన్నప్పుడే పత్రికా సమావేశాలకు హాజరు కావచ్చు, వార్తలు సేకరించవచ్చు, అధికారిక సమాచారాన్ని పొందవచ్చు అన్న భావన కూడా పెరిగింది. జర్నలిజం హక్కు క్రమంగా అనుమతి ఆధారిత వ్యవస్థగా మారడం ప్రజాస్వామ్య దృష్ట్యా ప్రమాదకరం.తెలంగాణలో జర్నలిస్టుల అక్రెడిటేషన్లు, అర్హతలు, సంక్షేమ పథకాల విషయంలో జీవో 239, జీవో 252 ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి. జీవో 239లోని కొన్ని నిబంధనలు వివక్షాత్మకమని అప్పట్లో జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశాయి. హైకోర్టు కూడా పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఆ తరువాత కొత్త మార్గదర్శకాలు వచ్చినప్పటికీ వివాదాలు పూర్తిగా తగ్గలేదు. పాత హక్కుల కోత, కార్యాలయ జర్నలిస్టులు మరియు క్షేత్రస్థాయి జర్నలిస్టుల మధ్య విభజన వంటి అంశాలు కొత్త అసంతృప్తికి దారితీశాయి.ఇక్కడ కనిపిస్తున్న పెద్ద విరుద్ధం జర్నలిస్టు సంఘాల వైఖరిలోనే ఉంది. ఒకప్పుడు జీవో 239ను తీవ్రంగా వ్యతిరేకించిన కొన్ని సంఘాలు తరువాత దానిని అంగీకరించాయి. అదే సంఘాలు నేడు మళ్లీ వ్యతిరేక స్వరం వినిపిస్తున్నాయి. ఈ మార్పులు జర్నలిస్టుల్లో అనేక సందేహాలను రేకెత్తిస్తున్నాయి. పోరాటం నిజంగా సూత్రాల కోసమా, లేక పరిస్థితులకు అనుగుణంగా మారుతున్న వ్యూహమా అన్న ప్రశ్నలు తప్పవు.ఇంతటి అక్రమాలు, విధానపరమైన విరుద్ధతలు ఉన్నప్పటికీ జర్నలిస్టు సంఘాల నుంచి ఆశించిన స్థాయిలో సమిష్టి స్పందన కనిపించకపోవడం కూడా బాధాకరం. జర్నలిస్టుల హక్కుల కోసం ముందుండాల్సిన సంఘాలు మౌనంగా ఉంటే, వ్యవస్థలోని లోపాలు మరింత బలపడతాయి.ఈ దందా వల్ల నష్టపోయేది కేవలం అక్రెడిటేషన్ కార్డు రాని జర్నలిస్టు మాత్రమే కాదు. మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థే దెబ్బతింటుంది. నకిలీ గుర్తింపులు పెరిగిన కొద్దీ నిజమైన జర్నలిస్టు, నకిలీ ప్రభావశాలి మధ్య వ్యత్యాసం చెదిరిపోతుంది. ఒకప్పుడు "ప్రెస్" అనే పదం గౌరవానికి ప్రతీక. నకిలీ ధ్రువపత్రాలపై స్వతంత్ర విచారణ జరగాలి. కమిటీల్లో కేవలం అధికారులు మాత్రమే కాకుండా సీనియర్ జర్నలిస్టులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులకు స్థానం కల్పించాలి.చివరికి అసలు ప్రశ్న ఒక్కటే. అక్రెడిటేషన్ కార్డు నిజంగా వృత్తి గుర్తింపా? లేక అధికారం, డబ్బు, ప్రభావం కలిసి సృష్టించిన కొత్త దందా వ్యవస్థా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన బాధ్యత కేవలం పాలకులదే కాదు. ప్రతి జర్నలిస్టుది, ప్రతి మీడియా సంస్థది, ప్రతి చైతన్య పౌరుడిదీ.

# అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



బీఆర్ఎస్ పార్టీ ఎస్ఐఆర్ కార్యక్రమాల పర్యవేక్షణ కమిటీతో ఆయన బుధవారం ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ ఆధ్వర్యంలోని ఈ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాల పురోగతిని, క్షేత్రస్థాయిలో ఓటర్ల నమోదు, పరిశీలనలో ఎదురవుతున్న పలు సమస్యలను కేటీఆర్‌కు వివరంగా వెల్లడించింది. దీనిపై స్పందించిన ఆయన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 లక్షల మంది ఓటర్ల పూర్తి వివరాలు అందుబాటులో లేకపోవడంతో అధికార యంత్రాంగం వారిలో చాలామందిని నోటీసులు జారీ చేసే విభాగంలో చేర్చిందని కేటీఆర్ తెలిపారు. అటువంటి ఓటర్లకు నోటీసులు అందిన వెంటనే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయికి వెళ్లి వారికి అవసరమైన మార్గనిర్దేశం చేయాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించబడకుండా పూర్తి అండగా నిలవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ మొత్తంలో ఏ ఒక్క అర్హ ఓటరు పేరు కూడా మిస్ కాకూడదని, అదే సమయంలో డూప్లికేట్ లేదా అనర్హులైన ఓటర్లు జాబితాలో కొనసాగకుండా కచ్చితమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వచ్చే ఆగస్టు 3వ తేదీ వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో పూర్తిస్థాయిలో నిమగ్నం కావాలని పిలుపునిచ్చారు.

ఆగస్టు 10వ తేదీన డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలైన తర్వాతే అసలు పని ప్రారంభమవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ముసాయిదా జాబితా వచ్చిన వెంటనే పేర్లు ఉన్నవారు, లేనివారి వివరాలను బూత్ స్థాయి వరకు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. డూప్లికేట్ ఓటర్ల తొలగింపుతో పాటు కొత్తగా అర్హులైన వారి పేర్ల నమోదు కోసం 'క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్' ప్రక్రియపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న జిల్లాల కమిటీలను అభినందించిన ఆయన, దీనిని ఒక పవిత్రమైన యజ్ఞంలా భావించి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నియోజకవర్గ ఇంఛార్జీలు, సభ్యత్వ ఇంఛార్జీలు, జనరల్ సెక్రటరీలు, కోఆర్డినేటర్లు అందరూ పరస్పరం సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఎన్నికల సమయంలో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రాకూడదంటే ఇప్పటినుంచే ప్రతి అర్హ ఓటరును గుర్తించి జాబితాలో చేర్పించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని కేటీఆర్ తెలిపారు. జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, నమోదు ప్రక్రియలో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయి వరకు పార్టీ యంత్రాంగం అంతా ఏకతాటిపైకి వచ్చి, అర్హులైన ప్రతి ఓటరుకు జాబితాలో స్థానం కల్పించేలా, అనర్హులు చోటుచేసుకోకుండా పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## అక్రమాలకు నిలయంగా విద్యా వ్యవస్థ

- ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్ సంచలన వ్యాఖ్యలు

ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచి, అత్యుత్తమమైనదిగా పేరుగాంచిన మన దేశ విద్యా వ్యవస్థ నేడు అక్రమాలకు, పేపర్ లీకేజీలకు నిలయంగా మారిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా, న్యాయం కావాలని డిమాండ్ చేస్తూ దిల్లీ వీధుల్లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్రంలోని అధికారంలో ఉన్న ప్రభుత్వం గడిచిన దశాబ్ద కాలంలో విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. గత పదేళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి ఏకంగా 152 సార్లు ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని వెల్లడించారు. ఈ అక్రమాల వల్ల దేశంలో సుమారు 7.50 కోట్ల మంది విద్యార్థుల జీవితాలు, వారి భవిష్యత్తు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత ఎంతగా నష్టపోతున్నా ఈ కేంద్ర ప్రభుత్వానికి కనీసం పట్టింపు లేకపోవడం శోచనీయమన్నారు.తమకు పారదర్శకమైన విద్యా వ్యవస్థ కావాలని, నిరుద్యోగ రహిత వాతావరణం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారని రాహుల్ తెలిపారు. దిల్లీలో న్యాయబద్ధంగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, జలఫిరంగులు వాడటాన్ని ఆయన తప్పుపట్టారు. లాఠీఛార్జ్‌లో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడిన దృశ్యాలు, రక్తం చిందిన ఫోటోలు, వారి ఆక్రందనలతో కూడిన వీడియోలను రాహుల్ గాంధీ స్వయంగా ప్రెస్ మీట్‌లో మీడియా ప్రతినిధులకు ప్రదర్శించి చూపించారు.పేపర్ లీకేజీల వెనుక పెద్ద బృందాలు పనిచేస్తున్నాయని, దేశానికి అత్యంత విలువైన విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని రాహుల్ విమర్శించారు. ఇన్ని వేల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతున్నా బాధ్యులపై కఠిన శిక్షలు పడటం లేదని మండిపడ్డారు. నీట్ ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. పరీక్షల్లో పారదర్శకతను పునరుద్ధరించడం ద్వారా మాత్రమే యువతకు విశ్వాసం కలుగుతుందని చెప్పారు.దిల్లీ వీధుల్లో హక్కుల కోసం పోరాడుతున్న వారు ఉగ్రవాదులు లేదా దేశ విద్రోహ శక్తులు కాదని, వారు మన దేశ భవిష్యత్తు మరియు ఆశలని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. నిరసన ప్రదర్శనల్లో పోలీసులు జరిపిన లాఠీఛార్జ్‌లో తమకు గాయాలు కావడంపై తాను బాధపడటం లేదని, విద్యార్థుల హక్కుల కోసం ఇంకా ఎన్ని దెబ్బలైనా తినడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. అయితే దెబ్బతిన్న విద్యార్థుల భవిష్యత్తు తలచుకుంటేనే తనకు తీవ్ర ఆవేదన కలుగుతోందని వ్యాఖ్యానించారు.కేంద్రంలో ఉన్న ప్రభుత్వ విధానాల వల్ల కార్పొరేట్ దిగ్గజాలైన అంబానీ, అదానీలకు ఎలాంటి నష్టం కలగడం లేదని, కేవలం సామాన్య పేద ప్రజలు, విద్యార్థులు మాత్రమే నష్టపోతున్నారని రాహుల్ దుయ్యబట్టారు. దేశంలో యువతకు సరైన ఉద్యోగావకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. చిన్నతరహా పరిశ్రమలు, వ్యాపార రంగాలు మూతపడటం వల్ల నిరుద్యోగం పెరిగిపోతోందని, బ్యాంకింగ్ వ్యవస్థలను బడా వ్యాపారులు లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థల్లో అవినీతికి తలుపులు బార్లా తెరిచారని విమర్శించారు.విద్యార్థులు సాగిస్తున్న ఈ న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలను తమ పార్టీ ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం లేదని కుండబద్దలు కొట్టారు. దేశంలో ప్రతిపక్ష నాయకుడిగా బాధిత ప్రజల, విద్యార్థుల గళాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువెళ్లడం తన ప్రాథమిక బాధ్యత అని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని ప్రకటించారు.

## మరింత పెరగనున్న విద్యుత్ వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ నినో ఎఫెక్ట్ వల్ల ఒకేసారి పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని సిబ్బంది ముందస్తు ప్రణాళికలు, అహర్నిశల శ్రమతో అధిగమించామని, ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగుతున్నామని చెప్పారు.రాష్ట్రంలో అసలు విద్యుత్ కోతలు (పవర్ కట్స్) లేవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖరాకండిగా స్పష్టం చేశారు. కేవలం వర్షాలు, ఈదురుగాలులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు స్తంభాలు నేలకూలడం, కరెంట్ లైన్లపై చెట్లు పడటం వల్ల జరిగే తాత్కాలిక అంతరాయాలను ప్రజలు పవర్ కట్‌గా భావించవద్దని కోరారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి భారీ ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావం వల్ల రైతులు బోర్ వెల్స్ వాడటం పెరిగినా, ఆ డిమాండ్‌ను ప్రభుత్వం విజయవంతంగా మేనేజ్ చేసిందన్నారు. 'ప్రజా బాట', 'పొలం బాట' ద్వారా అధికారులు నేరుగా క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నారని అభినందించారు.సాధారణంగా వర్షాకాలంలో రాష్ట్ర విద్యుత్ పీక్ డిమాండ్ 11,000 మెగావాట్లుగా మాత్రమే ఉంటుందని, అయితే ఈసారి ఎల్ నినో ప్రభావంతో అనూహ్యంగా వేసవిని తలపిస్తూ 16,500 మెగావాట్లకు చేరిందని ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఒకవైపు డిమాండ్ విపరీతంగా పెరగగా, మరోవైపు ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో 2,000 మెగావాట్ల జల విద్యుత్ (హైడల్ పవర్) ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయిందన్నారు. ఈ పరిణామాలు పంపిణీ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చినప్పటికీ, ప్రభుత్వం సమర్థవంతమైన నిర్వహణతో నిరంతర విద్యుత్ సరఫరాను సాధ్యం చేసిందని తెలిపారు.వినియోగదారులకు అందించే సేవా ప్రమాణాలను సరికొత్త ఎత్తులకు తీసుకెళ్లేందుకు దేశంలోనే ప్రథమంగా తెలంగాణలో 'ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్' సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని భట్టి విక్రమార్క ప్రకటించారు. సంస్థల రుణభారం తగ్గించి, నిర్వహణ సమర్థతను పెంచడం ద్వారా ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ డిస్కంలను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలబెడతామని ధీమా వ్యక్తం చేశారు. సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీఎండీ వరుణ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.విద్యుత్ రంగానికి వెన్నెముక లాంటి లైన్‌మెన్లు, కింది స్థాయి ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విధి నిర్వహణలో దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థికంగా కొండంత ఆసరాగా ఉండేందుకు రూ.1.20 కోట్ల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అలాగే లైన్ క్లియరెన్స్ పనుల్లో జరిగే ప్రమాదాలను అరికట్టేందుకు సిబ్బందికి అత్యాధునిక సేఫ్టీ కిట్లు, యూనిఫారాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'గృహజ్యోతి' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల పేద కుటుంబాల విద్యుత్ బిల్లుల మొత్తాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ నేరుగా డిస్కం కంపెనీలకు జమ చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఉచిత పథకాల వల్ల డిస్కంలపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన చెప్పారు.తెలంగాణ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు ఏటా భరిస్తున్న రూ.14,000 కోట్ల సబ్సిడీ నిధులను కూడా సమయానుకూలంగా విడుదల చేస్తోందన్నారు. ఆర్థిక శాఖ ఈ సబ్సిడీ మొత్తాన్ని నేరుగా డిస్కంలకు చెల్లిస్తుండటంతో సంస్థలు ఆర్థికంగా స్థిరపడటమే కాకుండా, రైతాంగానికి ఉచిత, నాణ్యమైన 24 గంటల విద్యుత్ సరఫరాకు ఎక్కడా ఢోకా లేకుండా పోతోందని పేర్కొన్నారు.

## నన్ను దెబ్బ తీసేందుకు కుట్ర...

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును అడ్డదారిలో తొలగించాలని చూసే వారి పట్ల నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.హిళా సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో రాజకీయ రంగంలో మహిళలదే పూర్తి ఆధిపత్యం నడుస్తుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే 50 శాతం రిజర్వేషన్లు సాధించుకున్న మహిళలు, త్వరలోనే అమల్లోకి రానున్న చట్టసభల రిజర్వేషన్ల ద్వారా అసెంబ్లీ, పార్లమెంట్లలోనూ 33 శాతం స్థానాలు కైవసం చేసుకోబోతున్నారని గుర్తుచేశారు. దీనివల్ల నిర్ణయాధికారంలో మహిళల పాత్ర మరింత కీలకమవుతుందన్నారు.మహిళల ప్రాతినిధ్యం పెరుగుతున్న తరుణంలో పురుషులు తమ ధోరణిని మార్చుకోవాలని సీఎం చమత్కరించారు. ఎప్పటికీ సమాజంలో, రాజకీయాల్లో మగవారిదే పెత్తనం అని భావించే రోజులకు కాలం చెల్లిపోయిందని వ్యాఖ్యానించారు. పురుషులు బాధ్యతాయుతంగా పనిచేసి తమ ఉనికిని కాపాడుకోకపోతే, రాబోయే రోజుల్లో ఇళ్లకే పరిమితమై వంట చేసుకోవాల్సిన పరిస్థితులు వస్తాయని సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో సభలో నవ్వులు పూశాయి.ష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ/నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలని సీఎం సూచించారు. "ఓటు హక్కు లేని మనిషి జీవించి ఉన్నా చచ్చిపోయిన వారితో సమానం" అంటూ తీవ్రమైన వ్యాఖ్య చేశారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లబ్ధి అందకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతీ అర్హుడైన పౌరుడు ఎస్ఐఆర్ ఫారాలు పూర్తి చేసి తమ ఓటు హక్కును పదిలపరుచుకోవాలని కోరారు.కొడంగల్ నియోజకవర్గంలో ఇప్పటికే 78 శాతానికి పైగా ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని సీఎం వెల్లడించారు. స్వయంగా తాను కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యారు. తన సమాచారాన్ని సమగ్రంగా ఎస్ఐఆర్ ఫారంలో నమోదు చేసి, స్థానిక బూత్ లెవెల్ ఆఫీసర్‌కు (బీఎల్వో) స్వయంగా అందజేశారు. ప్రజాప్రతినిధులు ముందుకు ఉండి తమ తమ ప్రాంతాల్లో వంద శాతం ఓటర్ల నమోదు జరిగేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులను, నాయకులను ఆదేశించారు.అంతకుముందు, దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి భారీ నిరసన చేపట్టారు. కొడంగల్‌లోని తన నివాసం నుంచి మొదలుకొని సుమారు ఒక కిలోమీటరు దూరంలో ఉన్న విప్లవమూర్తి అంబేద్కర్ విగ్రహం వరకు పాదయాత్రగా వెళ్లారు. సీఎం వెంట కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక ప్రజలు భారీగా తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు

# గాయపడ్డ సింహం రాహుల్ గాంధీ – ప్రజా ఉద్యమాలే బీజేపీ ప్రభుత్వ పతనానికి సంకేతం: పి. ప్రసన్న కుమార్ శర్మ

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**

దేశవ్యాప్తంగా యువత, మేధావులు, తటస్థ వర్గాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తూ నిర్వహిస్తున్న ఆందోళనలు, లోక్ భవన్ ముట్టడి వంటి కార్యక్రమాలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయనే సంకేతాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ, దేశంలో పదో తరగతి తర్వాత ఉన్నత విద్య చదివే విద్యార్థుల నుంచి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా వ్యయాలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. నిరసనలు వ్యక్తం చేస్తున్న వారిపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయ పడ్డారు.రాముడి పేరు చెబుతూ ధర్మం గురించి మాట్లాడే వారు, రామాలయానికి సంబంధించిన అవకతవకలపై వస్తున్న ఆరోపణలను నిష్పక్షపాతంగా విచారించకుండా సంబంధిత వారిని కాపాడే ప్రయత్నం చేయడం సమంజసం కాదని శర్మ విమర్శించారు.2014 సాధారణ ఎన్నికల నుంచి ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు



గాయ పడ్డ సింహం..!!

కల్పిస్తామని, ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందిస్తామని ఇచ్చిన హామీలు నెరవేరలేదని ఆయన అన్నారు. ప్రజల ఆకాంక్షలను విస్మరించి కేంద్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజాస్వామ్య పద్ధతిలో తమ తీర్పు ఇస్తారని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ పేదలు, బడుగు బలహీన వర్గాలు, విద్యార్థులు, యువత సమస్యలపై పోరాటం చేస్తుంటే, కాంగ్రెస్ కార్యాలయాలపై దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన అన్నారు. ప్రజలు, కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేక ఎదురుదాడులకు దిగుతున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.రాహుల్ గాంధీ దేశ భవిష్యత్ నాయకత్వానికి అవసరమైన లక్షణాలు కలిగిన నాయకుడని, ప్రజల్లో ఆయనపై విశ్వాసం పెరుగుతోందని శర్మ పేర్కొన్నారు. "గాయపడ్డ సింహం మరింత శక్తివంతంగా తిరిగి నిలబడుతుంది" అనే భావనతో రాహుల్ గాంధీపై జరుగుతున్న రాజకీయ దాడులు ప్రజల్లో మరింత సానుభూతిని కలిగిస్తున్నాయని ఆయన అన్నారు.రాహుల్ గాంధీపై జరుగుతున్న చర్యలు రాజకీయ కక్షసాధింపులో భాగమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన శర్మ, దేశం కోసం త్యాగాలు చేసిన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిణామాలపై భవిష్యత్తులో బీజేపీ ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని అన్నారు.ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడేందుకు ప్రతి భారతీయుడు ఒకసారి ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పిలుపునిచ్చారు.భారతదేశంలో ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతు, రాహుల్ గాంధీకి లభిస్తున్న ఆదరణను చూసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం ఆందోళనకు గురవుతోందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.ప్రస్తుత రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే, కేంద్ర ప్రభుత్వం దిక్కుతోచని పరిస్థితిలో ఉందని ఆయన విమర్శించారు. రాబోయే రెండేళ్లలో దేశ రాజకీయ ముఖచిత్రం మారబోతోందని, భారత ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఆదరించి దేశ భవిష్యత్తు బాధ్యతలను ఆయనకు అప్పగిస్తారని శర్మ అభిప్రాయపడ్డారు."దేశం కోసం, ధర్మం కోసం, విశ్వగురువు" వంటి నినాదాలతో మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ దేశ ప్రజలను, యువతను ఇకపై ఎంతకాలం మోసం చేస్తారని ఆయన ప్రశ్నించారు.భారతదేశ భవిష్యత్తు నిర్మాణానికి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుంచి నేటి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన, సమగ్ర దూరదృష్టి (విజన్) ఉందని శర్మ తెలిపారు. అదే విజన్‌కు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ దేశాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.భారత యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం, దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మరింత బలోపేతం చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో ఆ లక్ష్య సాధనకు పార్టీ కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. దేశ ప్రజల్లో రాహుల్ గాంధీ నాయకత్వంపై పూర్తి విశ్వాసం పెరుగుతోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి
పి. ప్రసన్న కుమార్ శర్మ

# నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల కోసం హెటెరో ఫార్మాస్యూటికల్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ

**హైదరాబాద్ వెలుతురు 22 జూలై:**

నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల కోసం హెటెరో ఫార్మాస్యూటికల్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ తెలంగాణ ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యాశాఖ, రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించి, ఉపాధి అవకాశాలను మెరుగు పరచే లక్ష్యంతో హెటెరో ఫార్మాస్యూటికల్స్ సంస్థతో అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకుంది.ఈ ఒప్పంద మార్పిడి కార్యక్రమం ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ శ్రీమతి అభిలాష అభినవ్, ఐఏఎస్, జాయింట్ డైరెక్టర్ యెంక్యా నాయక్, రాష్ట్ర వృత్తి విద్యా సంస్థ (SIVE) ప్రిన్సిపాల్ డా. జ్యోత్స్న రాణి, అలాగే హెటెరో సంస్థ ప్రతినిధులు డా. ఎస్. వెంకట జయపాల్ రెడ్డి (వైస్ ప్రెసిడెంట్–హెచ్‌ఆర్), మాధురి ఐ. (సీనియర్ మేనేజర్–హెచ్‌ఆర్), కర్ణకంటి వేణుమాధవ్ (ఆఫీసర్–హెచ్‌ఆర్) సమక్షంలో జరిగింది.ఈ భాగస్వామ్యం ద్వారా హెటెరో సంస్థ పరిశ్రమలతో పరస్పర అనుసంధానం, క్యాంపస్ నియామకాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, అధ్యాపకులకు పరిశ్రమల పరిచయం, సీఎస్ఆర్ కార్యక్రమాల కింద ప్రయోగశాలల అభివృద్ధి, అలాగే ముఖ్యంగా లైఫ్ సైన్సెస్ మరియు అనుబంధ విభాగాల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ మరియు వృత్తి విద్యార్థులకు ఉపాధి అవకాశాలను కల్పించనుంది.ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీమతి అభిలాష అభినవ్, ఐఏఎస్ మాట్లాడుతూ "విద్యార్థులకు సార్థకమైన వృత్తి అవకాశాలు కల్పించాలనే మా నిబద్ధతకు ఈ భాగస్వామ్యం నిదర్శనం. హెటెరోతో కలిసి పనిచేయడం ద్వారా ఫార్మాస్యూటికల్ రంగానికి అవసరమైన శిక్షణతో పాటు, దీర్ఘకాలిక మరియు స్థిరమైన ఉపాధి అవకాశాలను యువతకు అందిస్తున్నాం."హెటెరో సంస్థ వైస్ ప్రెసిడెంట్ (హెచ్‌ఆర్) డా. ఎస్. వెంకట జయపాల్ రెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాశాఖతో మా భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం పట్ల మేము గర్విస్తున్నాము. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన యువతకు 300కు పైగా ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్ర యువత ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించే ప్రభుత్వ లక్ష్యానికి మేము తోడ్పడుతున్నాము."వృత్తి విద్యను మరింత బలోపేతం చేయడం, విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంచడం, ప్రముఖ పరిశ్రమలతో స్థిరమైన భాగస్వామ్యాలను నెలకొల్పడం ద్వారా తెలంగాణ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించడంలో ఈ ఒప్పందం కీలక అడుగుగా ఇంటర్మీడియట్ విద్యాశాఖ భావిస్తోంది.





# మహాకవి దాశరథికి ఘన నివాళి

**101వ జయంతి వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు**

**హైదరాబాద్, జూలై జూలై 22 :**

మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల 101వ జయంతి వేడుకలు తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర భాషా–సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై మహాకవి దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.మంత్రి జూపల్లి మాట్లాడుతూ, దాశరథి కృష్ణమాచార్యులు తెలంగాణ ఆత్మను, ప్రజల ఆకాంక్షలను తన కవిత్వంలో ప్రతిబింబించిన మహోన్నత కవి అని కొనియాడారు. ఆయన సాహిత్యం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ప్రముఖ కవి అందెశ్రీ రచించిన "సాహిత్యం పాటల పూదోట – అందెల సవ్వడి" గ్రంథాన్ని ఆవిష్కరించారు.కార్యక్రమంలో



తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. బాలాచారి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, దాశరథి కుమార్తె ఇందిరా, సభ సమన్వయకర్త బడే సాబ్, ప్రముఖ కవులు అమ్మంగి వేణుగోపాల్, గంటా మనోహర్ రెడ్డి, సంఘన భట్ల నరసయ్య, రామకృష్ణ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మహాకవికి ఘనంగా నివాళులర్పించారు.

# రాహుల్ గాంధీ గారి అరెస్ట్ ప్రజాస్వామ్యంపై దాడి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గారు ఢిల్లీ జంతర్ మంతర్ లో విద్యార్థులపై లాఠీ ఛార్జీకి నిరసనగా శాంతి యుత మార్గంలో ప్రశ్నిస్తే ఆయనపై దాడి చేసి గాయపరిచి,నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేంద్రంలో ఉన్న అధికార పార్టీ రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తోందని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గారిని అక్రమంగా అరెస్టు చేయడం భయటపడ్డ కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి అద్దం పడుతోందని ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టడానికి మరియు రాహుల్ గాంధీ గారి అరెస్ట్‌కు నిరసనగా టిపిసిసి ఆధ్వర్యంలో 'ఛలో లోక్ భవన్' పిలుపునిచ్చినట్లు మంత్రి తెలిపారు."ప్రశ్నించే గొంతుకలను అరెస్టులతో ఆపలేరు. రాహుల్ గాంధీ గారి వెనుక దేశ ప్రజలందరూ ఉన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావలసిన సమయం ఇది." అని అన్నారు.పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు,విద్యార్థి లోకం ఛలో లోక్ భవన్ నిరసన కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

# హనుమకొండలో 'ఛాత్రోంకి గూంజ్' కార్యక్రమం..

**హనుమకొండ, వెలుతురు జూలై 22:**

దేశ భవిష్యత్తును నిర్మించే యువతకు నాణ్యమైన విద్య, పారదర్శకమైన పరీక్షా విధానం, సమాన అవకాశాలను కల్పించడం కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని, అయితే కేంద్ర ప్రభుత్వం ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు.హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కిషన్ పుర లో నిర్వహించిన "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు,వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కేఆర్ నాగరాజు గారు,శాసన మండలై సభ్యులు శ్రీ శంకర్ నాయక్ గారు డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామిరెడ్డి, అయూబ్ గారు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, విద్యార్థులు, యువజన ప్రతినిధుల కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, రీ–ఎగ్జామ్స్ వంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటూ లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర ఆందోళన, మానసిక వేదనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు నెలల తరబడి, సంవత్సరాల తరబడి కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, చివరికి ప్రశ్నాపత్రాల లీకుల కారణంగా వారి కృషి వృథా కావడం అత్యంత బాధాకరమని అన్నారు.NEET–UG 2026 పరీక్ష రద్దు దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర అనిశ్చితిని సృష్టించిందని, పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు, అనంతరం వెలుగులోకి వచ్చిన ఆరోపణలు పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేశాయని పేర్కొన్నారు. ఈ ఘటనల నేపథ్యంలో అనేక మంది విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యారని, కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడిన విషాద ఘటనలు దేశాన్ని కలచివేశాయని అన్నారు.ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకులకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, బాధ్యులపై చర్యలు తీసుకునే బదులు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని మండిపడ్డారు."విద్యార్థులు శాంతియుతంగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడితే వారిపై అమానుషంగా లాఠీలు ఎత్తడం అత్యంత దురదృష్టకరం. ఒకప్పుడు స్వాతంత్ర్య ఉద్యమంలో 'మమ్మల్ని కొట్టండి, దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వండి' అని పోరాడిన యువత చరిత్రను మనం చదివాం. నేడు 'మమ్మల్ని కొట్టండి కానీ మాకు న్యాయం చేయండి' అని విద్యార్థులు దెబ్బలు తింటున్న పరిస్థితి రావడం బాధాకరం" అని అన్నారు.విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి నిరసనగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీతో పాటు కాంగ్రెస్ ఎంపీలు శాంతియుత నిరసన చేపట్టగా, వారిని బలవంతంగా ఈడ్చుకుంటూ వెళ్లి అరెస్టు చేయడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.పార్లమెంట్‌లో NEET పేపర్ లీకేజీ అంశంపై సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం ప్రజల అనుమానాలను మరింత పెంచుతోందన్నారు. దేశ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించాల్సిన ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వీడి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్‌లో బీజేపీ నాయకులు ర్యాలీలు నిర్వహిస్తున్నారని, అయితే ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీకి మద్దతుగా ర్యాలీలు చేస్తున్నారా? లేక కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయొద్దని ర్యాలీలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు.తన రాజకీయ ప్రస్థానం కూడా విద్యార్థి నాయకుడిగానే ప్రారంభమైందని గుర్తు చేసుకున్న మంత్రి, విద్యార్థి ఉద్యమాల నుంచే ప్రజా సేవలోకి వచ్చానని చెప్పారు. విద్యార్థి శక్తి ఎన్నో చారిత్రక మార్పులకు కారణమైందని, దేశ భవిష్యత్తును మార్చే శక్తి యువత చేతుల్లోనే ఉందన్నారు.రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న "ఛాత్రోంకి గూంజ్" కార్యక్రమాల్లో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ యువతతో కలిసి నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.గత పదేళ్లలో దేశవ్యాప్తంగా అనేక ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షలు వివాదాల్లో చిక్కుకోవడం వల్ల యువతలో తీవ్ర నిరాశ నెలకొందన్నారు. పరీక్షా వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటే దేశ భవిష్యత్తుకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు.యువత కష్టపడి చదివి సాధించిన ప్రతిభకు విలువ దక్కేలా పారదర్శకమైన, నిష్పక్షపాతమైన, భద్రమైన పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రశ్నాపత్రాల లీకులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో సంపూర్ణ సంస్కరణలు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.దేశ యువత కలలను కాపాడటం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని, వారి ఆశలను చిదిమివేసే వ్యవస్థ కాదు, వారి ప్రతిభను గుర్తించి సమాన అవకాశాలు కల్పించే పాలన దేశానికి అవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. యువత హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.



# తీరాన్ని తాకే కెరటం: మనిషిలోని నిజమైన పోరాట పటిమ

జీవితం అనేది ఒక సమతలంగా సాగే ప్రయాణం కాదు. అదొక సుదీర్ఘమైన, ఊహించని మలుపులతో కూడిన ప్రయాణం. కొన్నిసార్లు జీవితం ఒక ప్రశాంతమైన నదిలా పారుతుంది, మరికొన్నిసార్లు పెను తుఫానులా మన జీవితాలపై విరుచుకుపడుతుంది. తీవ్రమైన కుటుంబ కష్టాలు, అణచివేయలేని ఆర్థిక ఇబ్బందులు, ఆశించిన గమ్యాల్లో ఎదురయ్యే ఊహించని పరాజయాలు, ఎంతో కాలంగా నమ్మిన మనుషుల నుండి ఎదురయ్యే నమ్మక ద్రోహాలు ఇలా ఎన్నో రూపాల్లో కాలం మన సహనానికి, ధైర్యానికి పరీక్ష పెడుతుంది. కానీ, ఈ పరీక్షలన్నింటినీ ధైర్యంతో తట్టుకుని, ఏమాత్రం తలవంచకుండా నిలబడేవాడే నిజమైన యోధుడు. సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచే ఒక గొప్ప పోరాట స్ఫూర్తి కథనమే ఈ వ్యాసానికి అసలైన ప్రేరణ.ప్రతి మనిషి జీవితంలోనూ ఏదో ఒక దశలో ఒక నిరాశాజనకమైన సమయం వస్తుంది. అప్పుడు చుట్టూ ఉన్న ప్రపంచమంతా చీకటిమయంగానే కనిపిస్తుంది. ముందుకు వెళ్లే దారి సరిగ్గా కనిపించదు, కష్టాల్లో తోడుగా నిలిచే హృదయాలు దొరకవు, కంటిపాపలా కాపాడుకున్న ఆశలన్నీ అడుగంటిపోతాయి. అయితే, సరిగ్గా అలాంటి క్లిష్టమైన క్షణాల్లోనే మనిషి అసలు ఆత్మవిశ్వాసం, స్వరూపం బయటపడతాయి. కొందరు బలహీనులు ఆ చీకటి భయానికి లొంగిపోయి వెనకడుగు వేస్తే, మరికొందరు మహోన్నతులు ఆ చీకటినే తమ విజయనగరానికి దారి చూపే వెలుగుగా మార్చుకుంటారు.వారు తమ ఆత్మలో దాగి ఉన్న ఆత్మవిశ్వాసపు అగ్నికణాన్ని రగిల్చుకుని, ఆ వెలుగులోనే ధైర్యంగా ముందుకు సాగుతారు. వారికి దారిలో ఎదురయ్యే ప్రతి ఆటంకం ఒక గొప్ప జీవిత పాఠంగా మారుతుంది. పదే పదే ఎదురయ్యే ప్రతి పరాజయం, వారిలో ఒక కొత్త బలాన్ని, నూతన ఉత్సాహాన్ని నింపే ఇంధనంగా రూపాంతరం చెందుతుంది.ఇలాంటి అరుదైన మనుషులు ఏ దూరపు తీరాల్లోనో ఉండరు. వారు నిత్యం మనందరి మధ్యే జీవిస్తూ ఉంటారు. ఒక్కోసారి మన కష్టసుఖాలు పంచుకునే మంచి స్నేహితుడిలా, ఒక్కోసారి కార్యాలయంలో పక్కనే పనిచేసే సహోద్యోగిలా, లేదా సమాజంలో ఎంతో నిశ్శబ్దంగా శ్రమించే ఒక సాధారణ కూలీలా మనకు కనిపిస్తారు. బయటకు కనిపించే వారి అత్యంత నిరాడంబరమైన జీవనశైలి వెనుక, ఒక పెద్ద సముద్రమంత దృఢమైన సంకల్పం దాగి ఉంటుంది.వారు ఎప్పుడూ తమ గురించి గొప్పలు చెప్పుకోవడానికి ఇష్టపడరు. తమ దైన్యాన్ని లేదా కష్టాలను ప్రదర్శించి ఇతరుల జాలిని కోరుకోరు. కానీ సరైన సమయం వచ్చినప్పుడు, తమ సామర్థ్యంపై సందేహాలతో ఎదురు నిలిచే ప్రతి ఒక్కరికీ తమ విజయాలతోనే దీటైన సమాధానం ఇచ్చే అద్భుతమైన ధైర్యం వారి సొంతం.కాలం అనేది ఎప్పుడూ ఒకే రకంగా ప్రయాణించదు. అది కొన్నిసార్లు మన ఆలోచనలకు అనుకూలంగా ప్రవహిస్తే, మరికొన్నిసార్లు మనల్ని తీవ్రమైన కష్టాల వైపు తరిమికొడుతుంది. కానీ నిజమైన పోరాటయోధుడు కాలాన్ని తన శత్రువుగా ఎప్పుడూ భావించడు. బదులుగా, దానిని ఒక గొప్ప సవాలుగా స్వీకరిస్తాడు. సమయం తనతో ఆటలాడుకోవాలని చూసిన ప్రతిసారీ, అతడు దానిని తన గెలుపు కోసం చేసే ఒక ధర్మసమరంగా మార్చి గెలిచి చూపిస్తాడు.నేటి ఆధునిక తరం యువత ఎదుర్కొంటున్న తీవ్ర పోటీ ప్రపంచంలో సరిగ్గా ఇదే స్ఫూర్తి ఎంతో అవసరం. ఎదురయ్యే ప్రతికూలతలను సైతం తమకు అనుకూలమైన అవకాశాలుగా మలుచుకునే నేర్పును ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి.నేటి యువతరం నిత్యం ఎన్నో రకాల ఒత్తిళ్లను, సవాళ్లను ఎదుర్కొంటోంది. సరైన ఉద్యోగ అవకాశాల కొరత, కఠినమైన పోటీ పరీక్షల ఒత్తిడి, పెరిగిపోతున్న కుటుంబ బాధ్యతలు, మరియు సమాజం మనపై ఉంచే భారీ అంచనాలు యువతను కుంగదీస్తున్నాయి. ఈ క్లిష్టమైన నేపథ్యంలో, జీవితంలో ఎదురయ్యే సవాళ్లు మనల్ని మానసికంగా మరింత బలంగా తీర్చిదిద్దడానికి వస్తాయని గ్రహించాలి. ప్రతి కష్టం మనల్ని కొంచెం తెలివైనవారిగా, వేగంగా సమయానుకూలంగా ఆలోచించేవారిగా మారుస్తుందని గుర్తించడం చాలా అవసరం.



అంచు మీద నిలబడి జీవించడం నేర్పే కఠినమైన పాఠాలను, సాఫీగా ఎలాంటి సవాళ్లు లేకుండా సాగే సాధారణ జీవితం ఏనాటికీ నేర్పలేదు. నిజానికి ఈ సమాజపు పోటీ వాతావరణమే మనల్ని శక్తివంతమైన యోధులుగా తీర్చిదిద్దుతుంది. అది ఆచరణలో కష్టంగా అనిపించినప్పటికీ, చివరికి మనల్ని చెక్కిన అసలైన గురువు ఆ అనుభవాలే.

సముద్రంలో పుట్టే పెద్ద అలలు ఎంత బలంగా వచ్చి తీరాన్ని ఢీకొట్టినప్పటికీ, తీరం ఎట్టి పరిస్థితుల్లోనూ తన స్థానం నుండి కదిలిపోదు. సరిగ్గా అదే స్థిరత్వం, అదే దృఢమైన మానసిక పరిపక్వత మనిషికి కూడా ఎంతో అవసరం. జీవితంలో ఎదురయ్యే ప్రతి పెద్ద సమస్య ముందు తలవంచకుండా, దానిని ధైర్యంగా ఎదుర్కొనే తీరంలా నిలబడటమే మనిషి సాధించే అసలైన విజయం.ఓటమి భయపెట్టినప్పుడు, నిరాశా నిస్పృహలు మనసును కమ్ముకున్నప్పుడు, మన లోలోపల రగిలే పట్టుదలే మనల్ని మళ్లీ లేపి నిలబెడుతుంది. సమస్యల సుడిగుండంలో మునిగిపోకుండా, కొత్త ఆశలతో పునః ప్రారంభించడానికి కావలసిన శక్తిని అందిస్తుంది.ఇలాంటి దృఢ సంకల్పం ఉన్న వ్యక్తులు తమ హృదయంలో ఒక నిశ్శబ్ద పోరాటాన్ని నిత్యం కొనసాగిస్తూనే ఉంటారు. బయటకు ఎంతో ప్రశాంతంగా, చిరునవ్వుతో కనిపించినా, లోపల మాత్రం నిరంతరం తమ లోపాలను సరిదిద్దుకుంటూ, తమను తాము మెరుగుపరుచుకునే ప్రయత్నం చేస్తూనే ఉంటారు. ప్రతిరోజూ వచ్చే ఉదయాన్ని ఒక కొత్త కథనంగా, ప్రతి సవాలును ఒక కొత్త అనుభవంగా స్వీకరిస్తూ ముందుకు సాగుతారు. గతం ఇచ్చిన గాయాలను మర్చిపోయి, భవిష్యత్తు నిర్మించుకోవడానికే తమ శక్తిని వెచ్చిస్తారు.

ఈ పోరాట కథనం కేవలం ఏ ఒక్క వ్యక్తికో లేదా ఒక ప్రత్యేక రంగానికో సంబంధించినది కాదు. ఇది ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో ఏదో ఒక దశలో తప్పక ప్రతిబింబించే సత్యం. తన కుటుంబ పోషణ కోసం రేయింబవళ్లు ఆరాటపడుతూ కష్టపడే ఒక సామాన్య తండ్రి కావచ్చు, లేదా పోటీ పరీక్షల్లో పదే పదే విఫలమైనా ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా మళ్లీ మళ్లీ ప్రయత్నించే విద్యార్థి కావచ్చు, లేదా ప్రాణాంతకమైన అనారోగ్యాన్ని సైతం నవ్వుతూ ధైర్యంగా ఎదుర్కొనే రోగి కావచ్చు వీరందరి అనుభవాల్లోనూ మనకు ఈ అపారమైన పోరాట స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తుంది.

సమాజం మనకు నేర్పే అత్యంత గొప్ప పాఠం ఇదే జీవితం మనల్ని ఎంత కఠినంగా మలిచినా, ఆ కాఠిన్యమే మనల్ని భవిష్యత్తులో మరింత శక్తివంతంగా, ధైర్యవంతులుగా తీర్చిదిద్దుతుంది. జీవితంలో ఎదురయ్యే ప్రతి అవరోధం ఒక కొత్త అవకాశానికి తలుపులు తెరుస్తుంది. ప్రతి చిన్న పతనం, మరింత ఎత్తుకి లేచి నిలబడే అపారమైన శక్తిని మనకు ప్రసాదిస్తుంది. అందువల్ల ఓటమిని చూసి భయపడటం కాకుండా, దానిని గెలుపుకు పునాదిగా మార్చుకోవాలి.

కాలక్రమంలో ఎన్నో పెద్ద తుఫానులు వచ్చిపోతుంటాయి, కానీ వాటిని తట్టుకుని నిలబడిన ధైర్యవంతుల కథలు మాత్రం చరిత్రలో తరతరాలుగా నిలిచిపోతాయి. రాత్రి వేళ చీకటి ఎంత దట్టంగా ఆవరించి ఉన్నా, ఉదయించే సూర్యుడి నుండి తప్పక ఒక చిన్న కాంతి కిరణం పుడుతుంది. ఆ చిన్న కిరణమే దారి తెలియక తడబడే మిగతా వారికి సరైన మార్గాన్ని చూపిస్తుంది.జీవితం మనకు నేర్పించే ప్రతి చిన్న పాఠాన్ని వినయంతో స్వీకరిస్తూ, ఎదురయ్యే ప్రతి సవాలును నవ్వుతూ ఎదుర్కొంటూ ముందుకు సాగేవారే వర్తమానంలో నిజమైన విజేతలు. అలాంటి నిరంతర పోరాట స్ఫూర్తే నేటి ఆధునిక సమాజానికి అత్యంత ఆవశ్యకమైన స్ఫూర్తిదాయక సందేశం. ప్రతి ఒక్కరి అంతరంగంలోనూ ఒక శక్తివంతమైన యోధుడు దాగి ఉంటాడు సరైన సమయం మరియు అవసరం వచ్చినప్పుడు అతడు నిశ్చయంగా మేల్కొంటాడు, విజయాన్ని అందిస్తాడు.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

## హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలు ముఖ్య నేతల అరెస్టులకు నిరసనగా మంత్రి పొన్నం ప్రభాకర్ మహా ధర్నా..

**హుస్నాబాద్ వెలుతురు జూలై 22:**

జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల పై లాఠీచార్జి ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమం లో నిరంకుశత్వంగా వ్యవహరిస్తు అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండింస్తు కాంగ్రెస్ పార్టీ మహాధర్నా..

**నీట్ పేపర్ లీకేజీ కి కారణమైన**

**కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలి**

**నీట్ అంశంపై పార్లమెంట్లో చర్చ జరగాలీ**

**నీట్ పేపర్ లీక్ పై హోంమంత్రి సమాధానం చెప్పాలి**

**నీట్ పేపర్ లీక్ తో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్రిషియా ఇవ్వాలి**

**ఢిల్లీలో విద్యార్థుల లాఠీచార్జి హింసపై విచారణ జరిపించాలని ప్లకార్డులతో నిరసన**

**ధర్నా లో పాల్గొన్న అన్ని మండలాల అధ్యక్షులు ,సర్పంచ్ లు , మార్కెట్ కమిటీ చైర్మన్ లు , పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు**

**మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ**

దేశంలో జరుగుతున్న అనేక పరిణామాల్లో ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తున్న పార్టీ గా విద్యార్థులపై జరిగిన దాడికి నిరసనగా వారికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ,ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే , ప్రియాంక గాంధీ, ఎంపీలు ధర్మేంద్ర ప్రధాన్ ను రాజీనామా చేయాలని చేసిన శాంతియుత నిరసన గా నిరంకుశత్వంగా వ్యవహరిస్తూ అరెస్ట్ చేశారు.మొన్న జరిగిన విద్యార్థుల నిరసన ప్రజాస్వామ్యంలో స్వతంత్ర ఉద్యమాన్ని , సత్యాగ్రహాన్ని తలపించింది శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులు తిరగబడకుండా పోలీసులు కొడుతుంటే ఇంకా కొట్టండి అని గాంధేయవాది గా నిరసన తెలిపారు అనేక మంది విద్యార్థులకు గాయాలయ్యాయి.విద్యార్థుల లాఠీచార్జ్ పై కనీసం హోంమంత్రి సంఘీభావం తెలపలేదు..ఇప్పటికే ఛాత్రోంకి గుంజ్ పేరుతో దేశ వ్యాప్తంగా విద్యార్థులతో రాహుల్ గాంధీ గారు విద్యా వ్యవస్థ పై మాట్లాడుతు విద్యార్థుల గొంతు వినిపిస్తున్నారు నరేంద్ర మోడీ ఇంటి ముందు శాంతియుత నిరసన చేస్తే అక్రమ అరెస్టులు చేశారు .. దానిపై నరేంద్ర మోడీ ఇంత వరకు మాట్లాడలేదు స్వాతంత్ర్యాన్ని తెచ్చిన పార్టీ గా జాస్వామ్యానికి రక్ష కాంగ్రెస్ పార్టీ లాఠీచార్జి కి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలి గాయపడిన వారికి మంచి వైద్యం అందించాలి

నీట్ పేపర్ లీకేజీ ఘటనలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి

లీకేజీ కారణమైన ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి .. ధర్మేంద్ర ప్రధాన్ ను మోదీ ఎందుకు కాపాడుతున్నారు

నీట్ పేపర్ లీకేజీ పై పార్లమెంట్ లో చర్చించాలి

దేవుడి పేరు మీద ఓట్లు అడిగే బీజేపీ అయోధ్య లో పైసలు గల్లంతు




చేశారు.. దోపిడి చేశారు

వాళ్ళను అయోధ్య లో ముందే గ్రహించి అక్కడ బీజేపీ ని కూడా గెలిపించలేదు

తెలంగాణ ఏర్పాటు పట్ల వివక్ష పూరితంగా మాట్లాడుతున్నారు

అంబేద్కర్ సాక్షిగా డిమాండ్ చేస్తున్న

రీచార్జి పై స్పందించాలి ... నీట్ పై చర్చించాలి

రాహుల్ గాంధీ మల్లికార్జున్ ఖర్గే ప్రియాంక గాంధీ వంద మంది ఎంపీలు ధర్నా చేస్తుంటే వారిని అక్రమంగా అరెస్టులు చేశారు దానిని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది ...

## నిరంకుశాన్ని ఎదురొడ్డి ప్రజల్లో చైతన్యం నింపిన ధీశాలి దాశరథి

**హైదరాబాద్, జూన్ 22 (వెలుతురు):**

తెలంగాణ రైతాంగ సాయధ పోరాటంలో అక్షరాన్ని ఆ యుధంగా మలిచి నిజాం నిరంకుశ పాలనపై ధిక్కార స్వరం వినిపించిన మహనీయుడు ఉద్యమ వైతాళికుడు, మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు అని తెలంగాణ సాంస్కృతిక మండలి చైర్పర్సన్ వెన్నెల గద్దర్ కొనియాడారు. దాశరథి 101వ జయంతిని భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్లోని రవీంద్రభారతిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కవి, రచయిత, పాలపిట్ట సాహిత్య మాస పత్రిక నిర్వాహకుడు, సీనియర్ జర్నలిస్టు గుడిపాటి వెంకటేశ్వర్లుకు డాక్టర్ దాశరథి సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఆయనకు అవార్డుతోపాటు రూ.1,00,116 చెక్కు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వెన్నెల గద్దర్ మాట్లాడుతూ దాశరథి




అభ్యుదయ భావాలతో అనేక రచనలు చేసి ప్రజలను చైతన్యం చేశారని, తన రచనలతో తెలంగాణ జాతిని జాగృతం చేశారని కొనియాడారు. స్వరాజ్యం, స్వేచ్ఛ కోసం నిరంతరం తపించిన దాశరథి స్ఫూర్తితో కవులు, కళాకారులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్యాన్ని అత్యున్నత శిఖరాల మీద నిలబెట్టిన దాశరథి కవిత్వం, సాహిత్యం భవిష్యత్తు తరాలకు నిత్య స్ఫూర్తిదాయకమని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సెక్రటరీగా ఎ. వాణీ ప్రసాద్ అన్నారు. లంగాణ ఉద్యమ స్ఫూర్తితో దాశరథి రచించిన పద్యాలు, పాటలు ఇప్పటికీ ప్రజలందరికీ ఉత్తేజాన్ని, స్ఫూర్తిని కలిగిస్తాయని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఏనుగు నర్సింహా రెడ్డి అన్నారు. తన ప్రాంత ప్రజల కష్టాలను, ప్రపంచానికి వినిపించిన తెలంగాణ గర్వించదగ్గ భూమి పుత్రుడు దాశరథి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పురస్కార ఎంపిక కమిటీ చైర్మన్ రచయిత డా. అమ్మంగి వేణుగోపాల్, దాశరథి కుమారుడు లక్ష్మణ్, కుమార్తె ఇందిరా, ఏవో డా. పి. విజయ్ కుమార్, సాంస్కృతిక సలహా మండలి సభ్యులు ముచర్ల దినకర్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిని, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డిని కలిసిన శంకర్పల్లి నూతన అధ్యక్షులు

**శంకర్పల్లి, వెలుతురు జూలై 22 :**





శంకర్పల్లి మున్సిపల్, మండల నూతన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా పార్టీ అగ్ర నాయకులను కలిశారు. శంకర్పల్లి మున్సిపల్ నూతన కాంగ్రెస్ ప్రెసిడెంట్ మడపతి చంద్రమౌళి, శంకర్పల్లి మండల నూతన కాంగ్రెస్ ప్రెసిడెంట్ బొల్లారం వెంకట రెడ్డిలు బుధవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్ చల్లా నరసింహారెడ్డిని, చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డిని ప్రత్యేకంగా కలుసుకున్నారు. తమపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించి నందుకు వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి శాయశక్తులా కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శంకర్పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చేకూర్తి గోపాల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు గణేష్, ఆనంద్, అలాగే ముఖ్య నాయకులు కావలి గోపాల్, పార్శి బాలకృష్ణ, నరేందర్ రెడ్డి, కాంత్ రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్విన్ డివిజన్ సమస్యలపై అధికారుల దృష్టికి కాంగ్రెస్ నేతల వినతి..

- **ఎల్లమ్మ చెరువు అభివృద్ధి నుంచి తాగునీటి సమస్యల వరకు పలు అంశాలపై జిల్లా గణేష్ నేత వినతులు – సమస్యల పరిష్కారానికి కమిషనర్ సృజన హామీ..**

**కూకట్ పల్లి జూలై 22 వెలుతురు:**



శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి ఆల్విన్ డివిజన్లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను స్థానిక కాంగ్రెస్ నాయకులు జిల్లా గణేష్ నేత సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, ఐఏఎస్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆల్విన్ డివిజన్ సమస్యల పరిష్కారం" కార్యక్రమంలో ఈ అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఆధ్వర్యంలో ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెరువు పరిసర ప్రాంతంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. కేటీఆర్ కాలనీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణానికి స్థలం కేటాయించినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడాన్ని ప్రస్తావిస్తూ, వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పీజేఆర్ నగర్లో ఉన్న బతుకమ్మ పార్క్ నిరుపయోగంగా మారిందని, దానిని అభివృద్ధి చేసి స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేస్తే మహిళలు, వృద్ధులు, యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. ఉషా ముళ్లపూడి ప్రధాన రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన యజమానులకు టీడీఆర్ (Transferable Development Rights) త్వరగా అందేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. అదేవిధంగా వాటర్ వర్క్స్ శాఖ తాగునీటి సరఫరా, వాల్వ్‌ల మరమ్మత్తుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆల్విన్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా పాల్గొని తమ ప్రాంతాల సమస్యలను అధికారులకు వివరించారు. ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ప్రస్తావించిన అన్ని సమస్యలపై కమిషనర్ సృజన ఐఏఎస్ సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# సూరారం సిఐ బాలరాజుకు శుభాకాంక్షలు

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 22:**



సూరారం పోలీస్ స్టేషన్ నూతనంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నియమితులైన K. బాలరాజుని ఎ.సుశాంత్ గౌడ్ మరియు ఎ.వేణుగౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ ప్రాంతానికి రావడం చాలా సంతోషంగా, గర్వంగా ఉందన్నారు. బాలరాజు గతంలో జీడిమెట్లలో సిఐగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ప్రజలతో మమేకం అయ్యి ఒక వైపు శాంతీ భద్రతలను మరో వైపు నేరస్థుల పాలిట కఠినంగా ఉంటూ ప్రజల గుండెలో సుస్థిర స్తనాన్ని సంపాదించుకున్నారు. మళ్ళీ సూరారం స్టేషన్ కి రావడం చాలా సంతోషకారమన్నారు. సిఐ మాట్లాడుతూ.... శాంతి భద్రతలు కాపాడడంలో మీ అందరి సహకారం తప్పనిసరి అని తెలిపారు.

# కార్యకర్తలకు ఎల్లపుడు అండగా ఉంటాను: ఎమ్మెల్యే కె.పి. వివేకానంద

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 22:**





బిఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లపుడు అండగా ఉంటానని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద పేర్కొన్నారు. బుధవారం చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్ బిఆర్ఎస్ నాయకులు LIC రాజు మరియు చిప్ప రమేష్ అనారోగ్యంతో ఉన్నారని స్థానిక నాయకుల ద్వారా తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి పరామర్శించి వారికీ వారి కుటుంబానికి ఎల్లపుడు మేము అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని ఆయన భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో చింతల్ డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ రఫీ, సీనియర్ నాయకులు సాంబయ్య, ఉప్పలయ్య, సామ్రాట్, లక్ష్మన్, చందు, శ్రీధర్, ప్రభాకర్, జహంగీర్, బాలు నేత, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూసాపేట్ నల్ల పోచమ్మ బోనాల మహోత్సవానికి బండి రమేష్‌కు ఆహ్వానం

- **ఆగస్టు 6న జరగనున్న వేడుకలకు హాజరుకావాలని దేవస్థానం కమిటీ వినతి..**

**కూకట్ పల్లి జూలై 22 వెలుతురు:**



మూసాపేట్ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ఆగస్టు 6న నిర్వహించనున్న బోనాల మహోత్సవాలకు కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్‌ను దేవస్థానం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ రాచమల్ల బిక్షపతి గౌడ్, దేవస్థానం ఈవో మాణిక్ ప్రభు ఆధ్వర్యంలో బండి రమేష్‌ను కలిసి బోనాల మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమానికి విచ్చేసి అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు.బోనాల మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా నిర్వహించేందుకు దేవస్థానం కమిటీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ ఆహ్వానాన్ని స్వీకరించి, మహోత్సవాల విజయవంత నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నట్లు తెలిసింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బి–బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మూసాపేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు తూము సంతోష్, కేబుల్ శ్రీనివాస్, రాచమల్ల శేఖర్ గౌడ్, కావలి పాండు ముదిరాజ్, మామిళ్ల రమేష్ యాదవ్, పెరుమాండ్ల నర్సింగరావు, రఘుపతి రెడ్డి, గురురాజ్ పంతులు, తోట రాజు, జైపాల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్లలో బాగా వర్షాలు కురువాలని శివాలయంలో 3వ రోజు వరుణ యాగం

- **శివలింగానికి ప్రత్యేక పూజలో పాల్గొన్న గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్**
- **వర్షాలు బాగా కురిసి రైతులు ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి**
- **రేపు శుక్రవారం శివలింగా నికి జలాభిషేకం భక్తులు పెద్దఎత్తున హాజరు కావాలి**
- **గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్**

**మంచాల వెలుతురు జులై 22:**



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వర్షాలు బాగా కురువాలని ఆదేవుని కటాక్షం కోసం ఆరు ట్ల శివాలయంలో వరుణయాగం మూడవరోజుకు చేరుకుంది మూడవ రోజు జరిగినవరుణయా గం లోగ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజుముదిరాజ్ దంపతులు గ్రామపంచాయతీ పాలక మండలి సభ్యులు గ్రామపెద్దలు భక్తులు కలిసి ముందుగా శివలింగాని కి ప్రత్యేక పూజలు చేసి అనంతరం వరుణయాగంలోకూర్చొని ప్రత్యేక పూజలు చేశారు ఈసంద ర్భంగా మాట్లాడుతూ సమయానికి వర్షాలు కురువక పంటలు వేసిన రైతులు వర్షం కోసం దిగులుగా ప్రతిరోజు ఎదురుచూస్తూ ఆందోళన చెందుతున్నారు వేసిన పంటలు చేతికి వస్తాయా రా వ అని అందుకే వరుణ దేవుడి కటాక్షంకోసం వరుణ యాగం ఏర్పాటుచేశాం అని అన్నారు వ ర్షాలు బాగాపడి రైతుల వేసిన పంటలు బాగాపండి ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాల ని అదేవుడికి ప్రత్యేక పూజలు చేశాం అనిఅన్నారు ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాట్లాడుతూ రేపు శుక్రవారం రోజు శివలిం గానికి జలాభిషేకం ఉంటుంది ఆరుట్ల గ్రామప్రజలందరూ ప్రతి ఇంటినుండి ఒక శంభులో నీరు తీసుకొని శివాలయం వద్దకు వచ్చి అభిషేక కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చా రు ఈకార్యక్రమంలో అయ్యప్ప స్వాముల గురుస్వామి కావలి శ్రీనివాస్ ముదిరాజ్ దంపతులు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మాదుగుల బాలమని కృష్ణగౌడ్ దంపతులు మొర్రిపద్మ ఐల య్య దంపతులు ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ దంపతులు పెద్దలు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ దంపతులు దంటు మధుసూదన్ రెడ్డి దంపతులు కొత్తపల్లి రవిగౌడ్ దం పతులు వినోదాచారి దంపతులు గోగిరెడ్డి జ్ఞానేశ్వర్ రెడ్డి దంపతులు భక్తులు పెద్దఎత్తున వరు ణ యాగంలో పాల్గొన్నారు

# విద్యార్థుల గొంతును అణచివేయడం ఎవరి తరం కాదు – యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది: డా. సత్యం శ్రీరంగం

- **ప్రధాన ప్రతిపక్ష నేతల అరెస్టు అప్రజాస్వామికం.. నీట్ లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: కాంగ్రెస్ డిమాండ్**

**కూకట్ పల్లి జూలై 22 వెలుతురు:**







విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, వారి గొంతును అణచివేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం తీవ్రంగా విమర్శించారు. దేశ యువత భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం పారదర్శక దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ ఆదేశాలపై నెక్లెస్ రోడ్ నుంచి లోక్ భవన్ వరకు నిర్వహించిన నిరసన ర్యాలీలో డా. సత్యం శ్రీరంగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రధాని నివాసం వద్ద నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. కోవిడ్ నిర్వహణలో లోపాలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతు సమస్యలు, వరుస ప్రశ్నాపత్రాల లీకేజీలు, ఎన్నికల వ్యవస్థపై తలెత్తిన అనుమానాలు వంటి ప్రజా సమస్యలపై రాహుల్ గాంధీ నిరంతరం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన నీట్ లీకేజీ అంశంపై కూడా గళమెత్తడం ప్రజాస్వామ్యబద్ధమైన బాధ్యతేనని అన్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా తీవ్ర మనోవేదనకు గురై ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించి, వాస్తవాలను దేశ ప్రజలకు వెల్లడించాలని కోరారు. దేశ యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. విద్యార్థుల గొంతును అణచివేయడం కాదు, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల హక్కులు, యువత భవిష్యత్తు పరిరక్షణ కోసం తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆయన వెల్లడించారు.

# పాపిరెడ్డి నగర్‌లో అక్రమ వాటర్ ప్లాంట్లపై అధికారుల ఉక్కుపాదం..

- **నోటీసులు జారీ చేసి సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు.. నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరిక**

**కూకట్ పల్లి జూలై 22 వెలుతురు:**




శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ సర్కిల్, వెంకటేశ్వర్ నగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్‌లో అక్రమంగా కొనసాగుతున్న వాటర్ ప్లాంట్లపై రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. నూతన తహసీల్దార్ శరత్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం సంబంధిత వాటర్ ప్లాంట్లకు నోటీసులు జారీ చేసి సీజ్ చేశారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తే కఠిన చట్టపరమైన చర్యలతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని అధికారులు హెచ్చరించారు. భూగర్భ జలాల పరిరక్షణ, అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టే దిశగా ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు చంద్రారెడ్డి మాట్లాడుతూ, పాపిరెడ్డి నగర్‌లో అక్రమ వాటర్ ప్లాంట్ల తొలగింపు కోసం బస్తి ప్రజలు చాలా కాలంగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని అన్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ బస్తి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భూగర్భ జలాలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్న చంద్రారెడ్డి, భావితరాలకు తాగునీటి వనరులను కాపాడేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే బస్తిలోని ప్రతి సమస్యను స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించి ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అగస్టిన్, ఆర్. భగవంతు రెడ్డి, నరసింహులు ముదిరాజ్, సి.హెచ్. సత్యనారాయణ రెడ్డి, బాల్‌రెడ్డి, తాటి కిరణ్, పి. శంకర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీకాంత్, వీరబాబు, సుజిత్, శివ, ప్రకాష్ రెడ్డి, వసీం, వనం అంజనేయులు, అరుణ లక్ష్మి , లక్ష్మమ్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘం కార్యాలయానికి కుర్చీలు సీలింగ్ ప్యాన్ లు పంపిణీ ఫౌండేషన్ సభ్యులు

- **నలుగురికి సమాజసేవ చేసుకుంటూ ముందుకు సాగటమే బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి లక్ష్యం ఫౌండేషన్ సభ్యులు**

**మంచాల వెలుతురు జులై 22:**




మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళల సౌకర్యార్థం బిఅర్ఆర్ ఫౌం డేషన్ మరో గొప్పసేవా కార్యక్రమం చేపట్టింది డ్వాక్రామహిళా సంఘం కార్యాలయానికి 60కు ర్చీలు 4సీలింగ్ ప్యాన్ లు బిఅర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పంపిణీ చేశారు ఈసందర్భంగా బి అర్ఆర్ ఫౌండేషన్ సభ్యుడు పున్నం రాము మాట్లాడుతూ మహిళా సంఘాలకు మరియు గ్రా మాలలో పేదవర్గాలకు విద్యవైద్యఇబ్బంది ఉన్నా కుటుంబాలకు తనవంతు సేవలను అందిస్తూ అన్న అంటే నేను ఉన్నానని భరోసాను ఇస్తున్నగొప్పసేవకుడు ఆపద్బాంధవుడు బిఅర్ఆర్ ఫౌం డేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి అనిఅన్నారు ఎల్లప్పుడు నలుగురికి సమాజసేవ చేయాలనే ల క్ష్యంతో సేవ చేసుకుంటూ మానవత్వం చాటుకుంటున్న గొప్పవ్యక్తి ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి అని అన్నారు ఈకార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ సద్దాం బర్మల వెంకటేష్ పోలమోని శ్రీకాంత్ ముదిరాజ్ మహమ్మద్ షాకేర్ మహిళా సంఘాల ప్రతినిధులు ఏపీఎం శేఖర్ గౌడ్ సిసి యాదగిరి విఓఏలు పల్లె రుద్ర తలారి ప్రమీల మహిళా సంఘం అధ్యక్షురాలు అనిత మరియు ఇతర సంఘసభ్యులు గ్రామపెద్దలు ఆమంచ కృష్ణ దాసరమోని శేఖర్ ముది రాజ్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మహిళా సంఘాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుండే బిఅర్ఆర్ ఫౌండేషన్ వారికి ఆరుట్ల గ్రామడ్వాక్రా సంఘాల సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు భవిష్యత్తులోఇలాంటి మరెన్నోసేవాకార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# కేజీబీవీ సిబ్బంది సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ పోస్ట్‌కార్డు ఉద్యమం

**గుండాల, జూలై 22: (వెలుతురు):**



రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డు ఉద్యమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యక్షులు అక్కెనపల్లి వెంకటాచారి ఆధ్వర్యంలో గుండాల మండలంలోని కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది రాసిన పోస్ట్‌కార్డులను సేకరించారు.ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ, కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు, 29 రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలులో ఉన్న ఆరోగ్య పథకాన్ని కేజీబీవీ సిబ్బందికీ వర్తింపజేసి, ఉద్యోగ భద్రతతో పాటు ఇతర సంక్షేమ సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో గుండాల మండల టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పులకరం వెంకటేష్, కేజీబీవీ ఓఎస్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాశం శ్రీనికేతన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 22:**



నార్కెట్‌పల్లి మండలం ఏడవెల్లి గ్రామానికి చెందిన ఎన్‌ఆర్ఐ పాశం గోపాల్ రెడ్డి – హేమలత దంపతుల కుమారుడు పాశం శ్రీనికేతన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా "మనం స్వచ్ఛంద సంస్థ" ఆధ్వర్యంలో 605వ రోజు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో 100 మంది నిరుపేదలు, నిరాశ్రయులు, బాటసారులకు భోజనాన్ని అందజేశారు.ఈ సందర్భంగా పాశం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, తమ కుటుంబంలోని ముఖ్యమైన రోజులను కేవలం ఆలయాల్లోనే కాకుండా నిరుపేదల మధ్య సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. "మనం స్వచ్ఛంద సంస్థ"లో ఇది తమ కుటుంబం నిర్వహిస్తున్న ఐదో అన్నదాన కార్యక్రమం అని తెలిపారు.పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో కాకుండా, అవసరమైన వారికి సహాయం చేయడం ద్వారానే నిజమైన గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. సమాజంలో రోడ్డుపై ఎన్నో మంది నిస్సహాయులు ఉన్నారని, వారికి ప్రతి ఒక్కరూ తమవంతు చేయూత అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొప్పు నాగరాజు, ఎడమ సత్తయ్య, గుర్రం సత్యం, అలుగుబెల్లి రాజశేఖర్ రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# గాధనబోయిన అచ్చాలు కు చిరుమర్తి లింగయ్య నివాళి

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 22:**



కట్టంగూర్ మండలం ముత్యాలమ్మగూడెం గ్రామానికి చెందిన గాధనబోయిన అచ్చాలు దశదినకర్మ కార్యక్రమానికి నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా గాధనబోయిన అచ్చాలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం

**యాదగిరిగుట్ట , జూలై 22 ( వెలుతురు న్యూస్ )**



కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆలేరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ కిరణ్ కుమార్ అన్నారు. నీట్ పేపర్ లీక్ పై విద్యార్థులకు మద్దతుగా ఢిల్లీలో ధర్నా చేపట్టిన రాహుల్ గాంధీని అరెస్టు చేసినందుకు నిరసనగా బుధవారం యాదగిరిగుట్టలో ఆలేరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు . నీట్ పేపర్ లీక్ సంఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తక్షణమే రాజీనామా చేయాలని మంగ కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థులు యువతతో చెలగాటమడే ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాధితుడికి అండగా.... వాణి అక్క ఉండగా...

**యాదగిరిగుట్ట జూలై 22 ( వెలుతురు న్యూస్ )**



యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని యాదవ నగర్ కాలనీలో కుక్కల దాడిలో పలు గొర్రెలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ప్రభుత్వ విప్ , ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ తదితరులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకొని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందడం బాధాకరమని బాధితుడిని అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ప్రభుత్వం తరపున కూడా తగిన విధంగా సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గొర్రెలు మృతిచెందిన సంఘటనలో బాధిత రైతు కుటుంబం పరిస్థితిని గమనించిన యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ అక్కడికక్కడే స్పందించి ఆర్థిక సహాయం అందించారు. యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత గౌడ్ బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా బాధిత రైతుకు అందించారు. బాధ్యత రైతు కుటుంబం అవస్థను చూసి ఆర్థిక సహాయం అందించిన మున్సిపల్ చైర్పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ దాతృత్వానికి స్థానికులు హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ప్రభుత్వం తరపున కూడా తగిన విధంగా సహాయ లభించేలా కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతు కుటుంబం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మున్సిపల్ చైర్పర్సన్ గుండ్లపల్లి వాణి భరత గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కేజీకేఏస్ రాష్ట్ర కల్లు గీత కార్మికుల బస్సు యాత్రను ఘన విజయవంతం చేయాలి: చిలువేరు సమ్మయ్య గౌడ్

**కేసముద్రం వెలుతురు జూలై 22:**




తెలంగాణ గీత కార్మికుల సంక్షేమ సంఘం (కేజీకేఏస్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర కల్లు గీత కార్మికుల బస్సు యాత్ర పోస్టర్‌ను కేసముద్రంలో గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కేజీకేఏస్ మండల అధ్యక్షులు బబ్బురి ఉప్పలయ్య, మండల కార్యదర్శి మోడం ఉపేందర్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికుల హక్కుల పరిరక్షణ, గీత వృత్తి అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ఈ బస్సు యాత్రను ప్రతి గీత కార్మికుడు తన సొంత కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.వీరశివాజీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా తెలంగాణ గీత కార్మికుల సంక్షేమ సంఘం ప్రతి ఏడాది రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ యాత్ర కొనసాగుతుందని చెప్పారు.కేజీకేఏస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితర రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బస్సు యాత్ర మహబూబాబాద్ జిల్లా నుంచి ప్రారంభం కావడం జిల్లాకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.ఆగస్టు 2వ తేదీ ఉదయం 11 గంటలలోపు మహబూబాబాద్‌లోని ఇల్లందు రోడ్డు ఆర్తి గార్డెన్స్ వద్ద రాష్ట్ర బస్సు యాత్ర ప్రారంభమవుతుందని, అక్కడ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం మహబూబాబాద్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి గూడూరు చేరుకుని రాత్రి బస చేయనున్నట్లు వివరించారు.

### కేసముద్రం వైపు బస్ యాత్ర

ఆగస్టు 3వ తేదీ ఉదయం గూడూరు నుంచి బయలుదేరిన రాష్ట్ర బస్సు యాత్ర అప్పనపల్లి మీదుగా కేసముద్రం మండలానికి చేరుకుంటుందని తెలిపారు. ఉదయం 8 గంటలకు కేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికి అక్కడి నుంచి భారీ ద్విచక్ర వాహన ర్యాలీతో కేసముద్రం ప్రధాన వీధుల గుండా మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి,పూలే కీ పూలమాల వేసిన అనంతరం బహిరంగ సభలో రాష్ట్ర నాయకులను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం రాష్ట్ర బస్సు యాత్రకు ఘనంగా సెండ్‌ఆఫ్ ఇచ్చి, తిమ్మంపేట,ఇనుగుర్తి మీదుగా మర్రిపేట వైపు సాగనంపనున్నట్లు వెల్లడించారు.

### అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలి: సమ్మిగౌడ్

గూడూరు నుంచి అప్పనపల్లి మీదుగా కేసముద్రం మండలంలోకి ప్రవేశించే రాష్ట్ర బస్సు యాత్రకు ఉమ్మడి కేసముద్రం మండలం లోని ప్రతి గ్రామం నుంచి కనీసం 50కు పైగా ద్విచక్ర వాహనాలతో బైక్ ర్యాలీగా తరలివచ్చి రాష్ట్ర బస్సు యాత్రను విజయవంతం చేయాలని, గీత కార్మికుల ఐక్యత, ఆత్మ గౌరవం మరియు సంఘటిత శక్తిని చాటిచెప్పేలా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని చిలువేరు సమ్మయ్య గౌడ్ పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బబ్బురు ఉప్పలయ్య,మోడెం వెంకటేశ్వర్లు,మెడి వెంకటేశ్వర్లు పలుస వెంకన్న,ఓరుగంటి వెంకన్న, చింతనూరి వెంకన్న,ఇనుగుర్తి వెంకన్న, రడం వెంకన్న, కదిరా సోమయ్య,జోగు రవీందర్ రాంపల్లి వెంకన్న పాల్గొన్నారు.

# గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయండి

**నార్కట్ పల్లి వెలుతురు జూలై 22:**



కల్లుగీత వృత్తిలో ప్రమాదాల నివారణ, వన సంరక్షణ, ఉపాధి, కార్మిక సంక్షేమం, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు 2026 ఆగస్టు 2 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా "గీతన్నల చైతన్య యాత్ర" బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పామనగండ్ల అచ్చాలు తెలిపారు. ఈ సందర్భంగా యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 2న ప్రారంభమయ్యే ఈ బస్సు యాత్ర ఆగస్టు 6న నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని తెలిపారు. జిల్లాలో దాదాపు 20 నుంచి 25 వేల మంది కల్లుగీత కార్మికులు ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తిలో ఆధునిక మార్పులు తీసుకువచ్చి ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలైన రూ.4 వేల పెన్షన్, రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, చెట్ల పెంపకానికి భూమి కేటాయింపు తదితర డిమాండ్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు.కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన కామ్రేడ్ ధర్మభిక్షం, తోట్ల మల్సూర్, బైరు మల్లయ్య, వర్ధెల్లి బుచ్చిరాములు, బాధిని చెన్నయ్య తదితర త్యాగమూర్తులను స్మరించుకుంటూ ఈ చైతన్య యాత్ర కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొప్పు శ్రవణ్, కార్యదర్శి కల్లూరి కంట్ల మహేశ్వర్, మాజీ సర్పంచ్ పుల్లెంల అచ్చాలు, బుడిగ నరసింహ, పుల్లెంల మహేష్, శ్రవణ్, సాయి, వేముల నరసింహ, బోయపల్లి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 22:**



పున్న జగన్మోహన్ మాట్లాడుతూ ఢిల్లీలో విద్యార్థులు చేపడుతున్న నిరసన కార్యక్రమానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం విద్యార్థులపై విచక్షణ రహితంగా దాడి చేయడం ద్వారా వేలాది మంది విద్యార్థులు గాయపడిన సంఘటన చూసి ప్రధాన ప్రతిపక్ష నేతగా కాంగ్రెస్ పార్టీ అధినేత చలో పిఎం హౌస్ నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వగా శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేస్తున్న రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకు సమాధానం చెప్పలేక అటు విద్యార్థుల పైన దాడికి సమాధానం చెప్పలేక కుట్రపూరితంగా రాహుల్ గాంధీ పై దాడి చేయడం పిరికిపందల చర్య అని రాహుల్ గాంధీ కుటుంబానికి ఈ దేశం కోసం రక్తం చిందించడం వారి కుటుంబమే ఒక చరిత్ర అని గాంధీ నుంచి నేడు రాహుల్ గాంధీ వరకు ఈ దేశం కోసం రక్తం చిందించినవారు. అని తెలుపుతూ. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధానమంత్రి మోడీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో పట్టణంకాంగ్రెస్ అధ్యక్షుడు జమీరుద్దీన్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్ ఉప సర్పంచ్ మోటె రమేష్, జింకల ప్రభాకర్, రెడ్డి బొడ్డు సాలయ్య సాల్వేర్ అశోక్, వనం చంద్రశేఖర్, మొహమ్మద్ నాసర్, మొహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్, మోటె మహేష్, మొహమ్మద్ అంజాత్, కేశవదాసు, వెంకటేష్, మిర్జా అసలం బేగ్, నోముల ప్రవీణ్ కుమార్, మహమ్మద్ రిజ్వాన్, లెక్కల ప్రవీణ్, మొహమ్మద్ అజార్, బండ అంజిరెడ్డి, కొండ శేఖర్ గౌడ్, గద్దం యాదగిరి, మీర్జా ఇ నాయ తుల్లా బేగ్, చింతల కృష్ణ, స్వామి, దామోదర్ రెడ్డి, లవణంసాయి, ఎండి సమీర్, సైదాచారి తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో మహాకవి దశరథి జయంతి వేడుకలు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 22:**



మహాకవి దాశరథి జయంతి సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో "దాశరథి సాహిత్యం–సందేశం" అను అంశంపై విస్తృత ఉపన్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ ఆర్.రత్నమంజుల మాట్లాడుతూ దాశరథి తెలంగాణ సాయుధ పోరాటంలో తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరిచిన గొప్ప కవి అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా విచ్చేసిన హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధిపతి డాక్టర్ మహమ్మద్ హసేన మాట్లాడుతూ దాశరథి తన జీవితాన్ని తెలంగాణ సమాజం కోసం అంకితం చేసిన మహనీయుడని, అద్భుతంగా రచనలు చేయడమే కాకుండా స్వయంగా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం అనుభవించిన యోధుడని అన్నారు. కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని నిజాం నిరంకుశత్వం మీద తిరుగుబాటు చేసిన వీరుడని, అణగారిన పీడిత తాడిత జనుల ఉద్ధరించడం కోసం కవిత్వం రాసిన ప్రజాకవియని, అటువంటి మహనీయుని నుండి ప్రతి ఒక్కరు స్ఫూర్తి పొందవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.చిన్నబాబు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. లక్ష్మీ, నీలిమ, అధ్యాపకులు అద్దంకి ఆంజనేయులు, డాక్టర్ జి.సునీత, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, డాక్టర్ డి. కిషన్, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను,జె. నరేశ్ తదితర అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్యాస్ గోదామును ఆకస్మికంగా తనిఖీ చేసిన యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత గౌడ్

- **సిలిండర్ పై అధిక రుసుము వసూలు ఆరోపణలపై ఆరా తీసిన చైర్పర్సన్**
- **అధిక రుసుము వసూలు ఆరోపణలపై గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను నిలదీసిన చైర్పర్సన్**

**యాదగిరిగుట్ట , జూలై 22 ( వెలుతురు న్యూస్ )**



యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా యాదగిరిగుట్ట పట్టణ శివారులోని గ్యాస్ గోదామును తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల పలువురు గ్యాస్ వినియోగదారులు తమకు గ్యాస్ సరఫరాలో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు అందుకే ఆకస్మికంగా గ్యాస్ గోదామును తనిఖీ చేశామని అన్నారు గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో ఎంత డబ్బులు చెల్లించాలో అంతే చెల్లించాలని అధికంగా సిబ్బంది డిమాండ్ చేస్తే మున్సిపల్ కార్యాలయంలో గ్యాస్ వినియోగదారులు ఫిర్యాదు చేయాలని కోరారు ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో అధిక రుసుము వసూలు చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని అన్నారు ఈ మేరకు తాము గ్యాస్ ఏజెన్సీ వారితో మాట్లాడమని తెలిపారు ఈ సందర్భంగా అక్కడున్న గ్యాస్ ఏజెన్సీ గోదాము సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు సిలిండర్ను ఏ ధరకు ఇవ్వాలో అంతే మొత్తాన్ని వినియోగదారుల నుంచి తీసుకోవాలని ఎక్కువ మొత్తం తీసుకుంటే సహించేది లేదని తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ యజమానులతో మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ మాట్లాడారు. యాదగిరిగుట్ట లోని శ్రీ లక్ష్మి నరసింహ ఎంటర్ప్రైజెస్ ఏజెన్సీ వారు ప్రజల నుండి ప్రతి సిలిండర్ పైన 996 రూపాయల 50 పైసలు మాత్రమే తీసుకోవాలని, దానిపైన అధికంగా డబ్బులు ఏమైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాన్ని యాదగిరిగుట్ట పట్టణ ప్రజలకు తెలియజేయవలసిందిగా కోరారు . ఈ ఆకస్మిక తనిఖీలో మున్సిపల్ వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, కౌన్సిలర్ బూడిద మధు, కమిషనర్ శ్రీనివాస్ , మున్సిపల్ అధికారులు సిబ్బంది స్థానిక నాయకులు గ్యాస్ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యంపై దాడి.. కేంద్ర ప్రభుత్వం తక్షణమే క్షమాపణ చెప్పాలి

- **మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. ఏ. చంద్రశేఖర్**
- **నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**
- **జహీరాబాద్‌లో కాంగ్రెస్ భారీ నిరసన.. ర్యాలీ.. రోడ్డుపై బైఠాయింపు**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 22:**





దేశానికి వెన్నెముకలాంటి విద్యార్థులు, యువత తమకు న్యాయం చేయాలని కోరుతూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపడుతుంటే వారిపై నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జ్ చేయడం అత్యంత దురదృష్టకరమని, ఇందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ ప్రజలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ ఆదేశాల మేరకు జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.నిరసన అనంతరం గాంధీ విగ్రహం నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు అక్కడ రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ అరెస్టును ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనగా అభివర్ణిస్తూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారికి సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.ప్రజాస్వామ్య గొంతుకను అణిచివేయడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించిన ఆయన, నీట్ పేపర్ లీక్ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, ప్రజల గొంతును అణచివేసే చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.విద్యార్థుల హక్కులు, యువత భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే ప్రతి పౌరుడి హక్కును ప్రభుత్వం గౌరవించాలని డాక్టర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, మండల అధ్యక్షులు హుగ్గెల్లి రాములు, భాస్కర్ రెడ్డి, పవన్ రాథోడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, మాజీ మండల అధ్యక్షుడు మక్సూద్ అహ్మద్, అసెంబ్లీ కో–ఆర్డినేటర్ గౌస్, కౌన్సిలర్ అశోక్–కవిత, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, మాజీ వైస్ చైర్మన్ ఖాజా, మాజీ వైస్ ఎంపీపీ రాములు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జహీరాబాద్‌కు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలి

- **డీజీపీకి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు వినతి...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 22:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)కి వినతిపత్రం అందజేశారు.హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ కలిసి రాష్ట్ర డీజీపీని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తరణ, పరిశ్రమల అభివృద్ధి, విద్యాసంస్థల పెరుగుదల, ప్రజా రవాణా వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చిందని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.జహీరాబాద్ ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణకు ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు రాష్ట్ర డీజీపీని కోరారు.

# కోహిర్‌లో ముగిసిన ప్రాథమిక ఉపాధ్యాయుల మూడురోజుల వృత్త్యంతర శిక్షణ

- **ప్రతి ఉపాధ్యాయుడికి వృత్త్యంతర శిక్షణ తప్పనిసరి....**
- **కోర్స్ డైరెక్టర్, ఎంఈఓ జాకీర్ హుస్సేన్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 22:**






సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో నిర్వహించిన మూడు రోజుల మండల స్థాయి ప్రాథమిక ఉపాధ్యాయుల వృత్త్యంతర శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శిక్షణా కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్, ఎంఈఓ జాకీర్ హుస్సేన్ నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, ప్రతి ఉపాధ్యాయుడికి వృత్త్యంతర శిక్షణ తప్పనిసరి అని, సమాజంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ వృత్తిపరంగా అభివృద్ధి చెందాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.మూడు రోజుల పాటు జరిగిన శిక్షణలో రిసోర్స్ పర్సన్లు రాజ్‌కుమార్, ఇబ్రహీం, సింహాచలం, గోవింద్‌రావు తెలుగు, గణితం, ఇంగ్లీష్‌తో పాటు ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన పలు అంశాలపై శిక్షణ అందించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని నూతన బోధనా విధానాలపై అవగాహన పెంపొందించుకున్నారు.

# ఎస్ ఐ ఆర్ లో ప్రతి ఒక్క ఓటరు నమోదు చేసుకోవాలి

- **కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాలలో ప్రజలకు వివరించాలి**
- **సంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ**
- **సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విఠల్**

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 22 :**





మెదక్ జిల్లా :– నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్.. ఎస్ ఐ ఆర్ లో ప్రతి ఒక్క ఓటరు తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్ సంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కోణం విఠల్ లు అన్నారు.. బుధవారం పెద్ద శంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పట్టణ ప్రాంతాలలో తప్పనిసరిగా ప్రతి ఓటరు తమ యొక్క పేరును ఎస్ఐఆర్ లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు వివరించాలన్నారు. ఎన్ డి ఏ ఆధ్వర్యంలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు సాగుతుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో భారతీయ జనతా పార్టీ పటిష్టతకు కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలో సైతం రాబోయే ఎన్నికల్లో డబుల్ ఇంజన్ సర్కార్ బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు మహిళలు సైతం బిజెపి వైపు చూస్తున్నారని వివరించారు.. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణ. బిజెవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ. బిజెపి నాయకులు శంకర్రావు. సుకుమార్. ఎర్ర శ్రీహరి. భూషణం. నర్సింలు. అంజయ్య. ఆయా గ్రామాల బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బర్దిపూర్ గురు పౌర్ణమి ఉత్సవాలకు మంత్రి దామోదర రాజనర్సింహకు ఆహ్వానం

- **ఈ నెల 29న శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో వేడుకలు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 22:**



సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఈ నెల 29న నిర్వహించనున్న గురు పౌర్ణమి మహోత్సవాలకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ ఆహ్వానించారు.బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో అవధూత గిరి మహారాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకుని గురు పౌర్ణమి ఉత్సవాల విశిష్టత, కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.ఆహ్వానాన్ని స్వీకరించిన మంత్రి దామోదర రాజనర్సింహ ఉత్సవాలకు హాజరయ్యేందుకు సానుకూలంగా స్పందించినట్లు ఆశ్రమ వర్గాలు వెల్లడించాయి.

# తాండూర్ రోడ్ ఫ్లైఓవర్‌పై వర్షపు నీటి మయం.. నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణం

- **నీటి నిల్వలు, బురదతో జారిపడుతున్న వాహనాలు**

**జహీరాబాద్ వెలుతురు జూలై 22:**








సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని తాండూర్ రోడ్ ఫ్లైఓవర్‌పై కురిసిన వర్షాల కారణంగా భారీగా వర్షపు నీరు నిల్వ ఉండడంతో పాటు బురద పేరుకుపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు, భారీ వాహనాల డ్రైవర్లు, పాదచారులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఫ్లైఓవర్‌తో పాటు పలుకిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో ప్రమాదాల భయం వెంటాడుతోంది.స్థానికుల కథనం ప్రకారం, ఫ్లైఓవర్‌పై సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రతి వర్షం తర్వాత నీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. దీంతో రహదారి మొత్తం బురదమయంగా మారి వాహనాలు జారిపడే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో నీటి గుంతలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రామ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ఫరీద్ మాట్లాడుతూ, ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతోందని తెలిపారు. ఫ్లైఓవర్‌పై నీరు నిల్వ ఉండటంతో ప్రతిరోజూ వందలాది మంది వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే పరిస్థితి నెలకొన్నదని అన్నారు.సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ఫ్లైఓవర్‌పై నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించడంతో పాటు బురదను పూర్తిగా శుభ్రం చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన కోరారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ ప్రధాన రహదారిపై సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భారతీయ జనతా పార్టీ యువజన మోర్చా (బీజేవైఎం) కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా సంగ నరేష్..

**కరీంనగర్ వెలుతురు జూలై 22:**



భారతీయ జనతా పార్టీ యువ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా చొప్పదండి పట్టణానికి చెందిన సంఘ నరేష్ ను నియమిస్తూ బిజెపి రాష్ట్ర శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బీజేవైఎం నూతన అధ్యక్షులుగా నియమితులైన నరేష్ మాట్లాడుతూ జిల్లాలో బీజేవైఎం బలోపేతానికి, యువతలో దేశభక్తి , జాతీయతా భావం పెంపొందించడానికి సామాజిక సేవ లో యువతను భాగస్వామ్యం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కరీంనగర్ పార్లమెంటు సభ్యులు,కేంద్ర హోం శాఖా సహాయ మంత్రి వర్యులు బండి సంజయ్, బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణా రెడ్డి ,కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ ,డిప్యుటి మేయర్ సునిల్ రావు ,కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ ప్రవీణ్ రావు , బిజేవైయం రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ లకు రాష్ట్ర,జిల్లా పార్టీ పెద్దలకు, నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

# కరీంనగర్ లో అర్ధరాత్రి దొంగల భీభత్సం, దోపిడీపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరా

**న్యూఢిల్లీ నుండి కరీంనగర్ సీపీ గౌస్ ఆలంకు ఫోన్ చేసిన కేంద్ర మంత్రి**

**దోపిడీ దొంగలపై ఉక్కుపాదం మోపాలని కోరిన బండి సంజయ్**

**ఇలాంటివి పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్న కేంద్ర మంత్రి**

**నిందితుల కోసం క్లూస్ టీమ్స్ రంగంలోకి దిగాయని చెప్పిన సీపీ**




**విచారణను ముమ్మరం చేశామని, నిందితులను అదుపులోకి తీసుకుంటామని చెప్పిన సీపీ**

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 22:**

# కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయంపై దాడి యత్నం ఘటనపై కరీంనగర్ సీపీకి బీజేపీ ఫిర్యాదు

- **మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**కరీంనగర్ వెలుతురు జూలై 22:**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారి కరీంనగర్‌లోని క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించిన ఘటనపై బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు గారితో కలిసి కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఈరోజు మధ్యాహ్నం సుమారు 12:15 గంటల సమయంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు సుమారు 50 మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందిపై దాడికి యత్నించడంతో పాటు, వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ప్రాణాలకు ముప్పు కలిగించేలా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.అదే సమయంలో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసు సిబ్బందిని సైతం అడ్డుకొని, వారి విధుల నిర్వహణకు ఆటంకం కలిగించారని ఆరోపించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ఎంపీ కార్యాలయంలోకి చొరబడి సిబ్బందిపై దాడికి యత్నించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎన్నం ప్రకాష్, కో–ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాపాక ప్రవీణ్, బీజేపీ నాయకులు పుప్పాల రఘు, కరండ్ల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్‌పై సైబరాబాద్ సీపీ సమీక్ష





**సైబరాబాద్ వెలుతురు జూలై 22:**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్, పర్యవేక్షణ, నిర్వహణ, విస్తరణపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్,. అధ్యక్షతన బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ ఆడిటో రియంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, నేరాల దర్యాప్తు, కీలక సమాచార సేకరణలో సీసీటీవీ కెమెరాలు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలన్నింటినీ జియో ట్యాగింగ్ చేసి వాటి వివరాలను డిజిటల్ డేటాబేస్‌లో నమోదు చేయాలని, కొత్తగా ఏర్పాటు చేసే ప్రతి కెమెరాను కూడా వెంటనే జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ స్టేషన్‌లో సీసీటీవీ వ్యవస్థ పర్యవేక్షణ కోసం ప్రత్యేక అడ్మిన్‌ను నియమించి, కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. పనిచేయని కెమెరాలను వెంటనే మరమ్మతులు చేయించి, ఇప్పటికే ఉన్న కెమెరాలను పోలీసు పర్యవేక్షణ వ్యవస్థతో అనుసంధానం చేయాలని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో "నేను సైతం" కార్యక్రమం ద్వారా మరిన్ని సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా, చాలా చోట్ల మరుగున పడిన డీవీఆర్ (DVR) ఆధారిత సీసీటీవీ వ్యవస్థలను ఆధునిక ఎన్‌వీఆర్ (NVR) సాంకేతికతకు అప్‌గ్రేడ్ చేసే అంశంపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. కమిషనరేట్ వ్యాప్తంగా డీవీఆర్ వ్యవస్థలను దశలవారీగా ఎన్‌వీఆర్ విధానానికి మార్చేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సాంకేతిక అనుమతులు, మౌలిక సదుపాయాల కల్పన, పోలీస్ స్టేషన్ల నుంచి ప్రధాన కంట్రోల్ సెంటర్ వరకు నెట్‌వర్క్ అనుసంధాన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలోని సీసీటీవీ నెట్‌వర్క్‌ను సెంట్రల్ కంట్రోల్ వ్యవస్థతో అనుసంధానం చేయడం ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ, వీడియో రికార్డింగ్, ఫుటేజీ నిల్వ, అవసరమైన సమయంలో ఆధారాల సేకరణ, విశ్లేషణ మరింత వేగంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసిన వెండర్లు కెమెరాల నిర్వహణ, సాంకేతిక లోపాల పరిష్కారం, సేవల నిరంతర అందుబాటుపై పూర్తి బాధ్యత వహించాలని సీపీ స్పష్టం చేశారు. జియో ట్యాగింగ్ ప్రక్రియ, సాఫ్ట్‌వేర్ వినియోగం, కెమెరాల నిర్వహణపై అధికారులు, సిబ్బంది, వెండర్లకు ప్రత్యేక శిక్షణ, ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించాలని సూచించారు.సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ సీసీటీవీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు, నేరాల దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచి ప్రజలకు మరింత మెరుగైన భద్రతను అందించవచ్చని డా. ఎం. రమేష్ తెలిపారు. సీసీటీవీ కెమెరాల జియో ట్యాగింగ్, సెంట్రల్ మానిటరింగ్, డీవీఆర్ నుంచి ఎన్‌వీఆర్ వ్యవస్థకు మార్పు ద్వారా నేరాలపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని, తద్వారా నేరాలు గణనీయంగా తగ్గుముఖం పడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో "నేను సైతం" కార్యక్రమాన్ని మరింత విస్తరించి, నివాస గృహాలు, అపార్ట్‌మెంట్లు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసులతో అనుసంధానం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజల సహకారం, ఆధునిక సాంకేతికత కలిసివస్తే సైబరాబాద్ కమిషనరేట్‌ను మరింత సురక్షితమైన ప్రాంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను – భీమ్ లక్ష్మణ్ ముదిరాజ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**



దేశంలో నీట్ (NEET) పరీక్షల అవకతవకలతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో, వారి తరపున బాధ్యతాయుతంగా గళం వినిపించేందుకు వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ గారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరం, ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య అని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను.దేశంలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ నాయకుడిని తన ప్రజాస్వామ్య హక్కును వినియోగించినందుకు అరెస్టు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ప్రజల సమస్యలను లేవనెత్తే ప్రతిపక్ష నాయకులను అణచివేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోంది.నీట్ వ్యవహారంలో దేశ యువత ఎదుర్కొంటున్న ఆవేదనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ గారు వెంటనే తన పదవికి రాజీనామా చేసి దేశ యువతకు బహిరంగ క్షమాపణ చెప్పాలి.అదేవిధంగా, శ్రీ రాహుల్ గాంధీ గారిని అరెస్టు చేసిన ఘటనపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ప్రజాస్వామ్యంలో విభిన్న అభిప్రాయాలను అణచివేయడం కాదు, వాటిని గౌరవించడం ప్రభుత్వ బాధ్యత.ప్రజల గొంతుకను ఎంత అణచివేయాలని ప్రయత్నించినా, ప్రజాస్వామ్యాన్ని ఎవరూ బంధించలేరు. ఇటువంటి ప్రజావ్యతిరేక చర్యలకు రానున్న రోజుల్లో దేశ ప్రజలు తమ ఓటు ద్వారా తగిన సమాధానం చెబుతారని నేను విశ్వసిస్తున్నాను.

# దిల్సుఖ్‌నగర్ రవీంద్రభారతి పాఠశాలలో ఘనంగా విద్యార్థుల నాయకత్వ ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**



దిల్సుఖ్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థుల నాయకత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ వేడుకకు రవాణా శాఖ ఏసీపీ రఘుపాల రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు పలువురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన విద్యార్థి నాయకులకు ముఖ్య అతిథి చేతుల మీదుగా ప్రత్యేక బ్యాడ్జీలను అలంకరించి, వారి బాధ్యతలను గుర్తుచేస్తూ శుభాకాంక్షలు అందజేశారు.అనంతరం ఏసీపీ రఘుపాల రామ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి పాఠశాల దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఆయన హితవు పలికారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్, వీరయ్య, ప్రిన్సిపాల్ లావణ్, డి.ఓ నిశాంత్ తో పాటు ఇతర ఉపాధ్యాయ బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పార్లమెంట్‌ను విస్మరించి రోడ్లపై డ్రామాలు ఆడుతున్న రాహుల్ గాంధీ తీరుపై బిజెపి తీవ్ర ఆగ్రహం

- **బొక్క బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పర్పల్లి చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం**

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**





ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాల్సింది పోయి, చట్ట విరుద్ధంగా వీధుల్లోకి వచ్చి దేశ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారి నివాసం వద్ద ధర్నాలు చేయడం రాహుల్ గాంధీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బిజెపి నాయకులు తీవ్రంగా మండిపడ్డారు.బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచంద్రరావు గారి పిలుపు మేరకు, రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్గూడ డివిజన్, ఉప్పర్పల్లి చౌరస్తాలో బిజెపి నాయకులు బొక్క బాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బిజెపి నాయకులు, కార్యకర్తలు గురువారం దహనం చేశారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షాల దిగజారుడు రాజకీయం ఇప్పటి వరకు చిన్నపాటి నాయకులు బయటకు వచ్చి రాజకీయాలు చేస్తే, ఇప్పుడు అసలైన నాయకులంతా బయటపడ్డారని విమర్శించారు. రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, ప్రియాంక గాంధీ, అఖిలేష్ యాదవ్ వంటి నాయకులందరూ ఏకమై దేశంలో గందరగోళం సృష్టించడానికి వీధుల్లోకి వస్తున్నారని ధ్వజమెత్తారు.

**ప్రజాస్వామ్య వ్యవస్థల అవమానం:**

పార్లమెంట్ వేదికగా ప్రజల పక్షాన మాట్లాడే అవకాశం ఉన్నప్పటికీ, అక్కడ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలపడం ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధం.

**రాజకీయ పబ్లిసిటీ డ్రామాలు:**

కేవలం వార్తల్లో నిలవడానికి, సోషల్ మీడియా ప్రకటనల కోసమే రాహుల్ గాంధీ ప్రధాని నివాసం వద్ద ఆందోళనల పేరుతో డ్రామాలు ఆడుతున్నారు.

**భద్రతా నిబంధనల ఉల్లంఘన:**

దేశ ప్రధాని నివాసం వద్ద భద్రతా ఆంక్షలను ఉల్లంఘిస్తూ ధర్నాలు చేయడం ద్వారా చట్టాన్ని, భద్రతా వ్యవస్థలను ఏమాత్రం గౌరవించడం లేదని స్పష్టమవుతోంది.

**దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి:**

ఇటువంటి చర్యలతో ప్రజలను, యువతను గందరగోళానికి గురిచేస్తున్నందుకు రాహుల్ గాంధీ మరియు ప్రతిపక్ష నాయకులు దేశ ప్రజలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి నాయకత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్ష కూటమి ఇలాంటి చవకబారు రాజకీయాలకు దిగుతోందని, భవిష్యత్తులో కూడా వీరి వైఖరిని బిజెపి శ్రేణులు సమర్థవంతంగా తిప్పికొడతాయని హెచ్చరించారు.కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు ఈ కార్యక్రమానికి బొక్క బాల్ రెడ్డి నాయకత్వం వహించగా బిజెపి సీనియర్ నాయకులు సులేగా విట్టల్, గోనే శ్రీకాంత్ రెడ్డి, డివిజన్ జనరల్ సెక్రెటరీ పవన్, పార్టీ నాయకులు & కార్యకర్తలు పలుగుచెరువు నరేందర్, వనపర్తి భూపాల్, బుర్రి శేఖర్, ఏరోళ్ల మనోజ్, సద్దుల మనోజ్ మరియు భారీ సంఖ్యలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థి నేత యంగలి గోపి జన్మదిన సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అశీర్వాదం

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**



విద్యార్థి నేత యంగలి గోపి గౌడ్ తన జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి, యంగలి గోపి గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# రాహుల్ గాంధీ అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్న

- **వాంగుచుక్ నిరాహార దీక్షను భగ్నం చేయడం బాధాకరం**
- **కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**మోత్కూర్ వెలుతురు జూలై 22:**



రాహుల్ గాంధీ స్వయంగా విద్యార్థుల పక్షాన నిరసనకు దిగారు

శాంతియుత మార్గంలో నిరసన వ్యక్తం చేస్తే విద్యార్థుల మీద లాటిఛార్జి చేయడాన్ని రాహుల్ గాంధీ గారిని అరెస్ట్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నా

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రాహుల్ గాంధీ ప్రధాని చేయడానికి కాంగ్రెస్ పార్టీ కాపాడడానికి సైనికుల్లాగా పని చేస్తారు

విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన ప్రభుత్వమే వారి పైన చర్యలు తీసుకోవడం బాధాకరం

వాంగ్ చుక్ నిరాహార దీక్షను భగ్నం చేయడం మంచి పద్ధతి కాదు

రాహుల్ గాంధీ రెస్ట్ ని తీవ్రంగా ఖండిస్తున్నాం

పాత కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యతను ఏఐసిసి ఇంచార్జ్,పిసిసి అధ్యక్షులు తీసుకుంటే మంచిదనేది నా అభిప్రాయం

అందర్నీ సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలి

గెలిపించిన కార్యకర్తలని అధికారంలోకి వచ్చాక వాళ్ళ పైన కేసులు పెట్టడం బాధాకరం

కెసిఆర్ ని గద్దె దించడానికి చాలామంది కార్యకర్తలు లాటి దెబ్బలు తిన్నారు

**ఇతర పార్టీ నుంచి వచ్చిన వాళ్లది ఒకటే పార్టీ వాళ్లది రూలింగ్ పార్టీ**

దేశం మొత్తం రాహుల్ గాంధీ వైపు చూస్తోంది ఈ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సి ఉంది దానికోసం రాత్రింబవుళ్ళు రాహుల్ గాంధీ కష్టపడుతున్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకత్వంపై ఉన్నది.

# "హెచ్ఐవి లేని హైదరాబాద్ జిల్లా" లక్ష్యంగా కార్యక్రమాలు 959595 టార్గెట్ సాధనకు ప్రత్యేక చర్యలు

**హైదరాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**





జిల్లాలో హెచ్ఐవి నియంత్రణ, నివారణ కార్యక్రమాలపై జరిగిన సమీక్ష సమావేశానికి హైదరాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఐసీటీసీ సెంటర్, UPHC మరియు బస్తీ దావఖానా లలో హెచ్ఐవి టెస్టింగ్ మరియు స్క్రీనింగ్ కార్యక్రమాలు నిరంతరాయంగా జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.

**95-95-95 టార్గెట్ పై ప్రత్యేక దృష్టి**

జాతీయ లక్ష్యమైన 95-95-95 ను ఈ నెలలోనే సాధించాలని DMHO డా. పుట్ల శ్రీనివాస్ గారు ఖచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు.

**అందులో భాగంగా:**

1. హెచ్ఐవి సోకిన వారిలో 95% మందిని గుర్తించడం
2. గుర్తించిన వారిలో 95% మందిని చికిత్సలోకి తీసుకు రావడం
3. చికిత్స పొందుతున్న వారిలో 95% మందికి వైరల్ లోడ్ అణచివేత సాధించడం

ఈ లక్ష్యాలను అతి త్వరగా పూర్తి చేసేందుకు ఫీల్డ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, మైక్రోప్లాన్ ప్రకారం పనిచేయాలని సూచించారు.

**గర్భిణులందరికీ తప్పనిసరి హెచ్ఐవి స్క్రీనింగ్**

జిల్లాలో ఉన్న ప్రతి గర్భిణి స్త్రీకి తప్పనిసరిగా హెచ్ఐవి స్క్రీనింగ్ చేయాలని DMHO ఆదేశించారు. గర్భధారణ సమయంలోనే టెస్ట్ చేసి, పాజిటివ్ వచ్చిన తల్లులకు వెంటనే PMTCT సేవలు అందించడం ద్వారా నవజాత శిశువులకు హెచ్ఐవి సంక్రమణ జరగకుండా చూసే బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని తెలిపారు.

**"హెచ్ఐవి లేని జిల్లా" లక్ష్యం**

"భవిష్యత్తులో మన జిల్లాలో 'హెచ్ఐవి' అనే మాట కూడా వినపడకూడదు. హైదరాబాద్ జిల్లాను హెచ్ఐవి లేని జిల్లాగా అభివృద్ధి దశలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని డా. పుట్ల శ్రీనివాస్, DMHO, హైదరాబాద్ గారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, కౌన్సెలర్లు, ORWలు, PEలు అందరూ సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డా. సరస్వతి అడిషనల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి,(AIDS & Leprosy), డా. శ్రీధర్ , జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి,డా. మురళీధర్, Dr. లక్ష్మణ్,Dr. శ్రీ కల, మీడియా అధికారి జక్కుల రాములు, ఇంచార్జ్ మలేరియా అధికారి ఆంజనేయులు, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, వైద్యాధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం

- **హైదరాబాద్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) సభ్యులు సురేష్ లాల్ నేతికార్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**



నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు సంబంధించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ఏఐసీసీ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ముట్టడికి ప్రయత్నించింది. ప్రధాని నివాసం వద్ద ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ అరెస్ట్‌లను నిరసిస్తూ బుధవారం రాష్ట్ర పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా లోక్ భవన్ వరకు చేపట్టిన నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హైదరాబాద్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) సభ్యులు సురేష్ లాల్ నేతికార్ పాల్గొని నీట్ పరీక్ష వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరసనకు మద్దతు తెలిపిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రావు, సాయి నేతికార్ పురుషోత్తమ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్చకులు మరియు గిరిజన అర్చకుల ప్రతిని ధులతో ముఖాముఖీ విజయవంతం..



- **ధూప దీప నైవేద్యం భత్యం పెంపుతో పాటు సంక్షేమానికి పూర్తి భరోసా ఇచ్చిన కమిటీ**

**హైదరాబాద్ వెలుతురు జూలై 22, 2026:**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం. 679) ముఖాముఖి సమీక్షల పరంపరలో భాగంగా నేడు అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) లో రాష్ట్రవ్యాప్తంగా మలిదశ ఉద్యమంలో ఆధ్యాత్మిక రంగాన్ని ఏకం చేసి పోరాడిన అర్చకులు మరియు గిరిజన అర్చకుల ప్రతినిధులతో ప్రత్యేక ముఖాముఖి సమావేశాన్ని నిర్వహించింది.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్ , శ్రీ మోతె శోభన్ రెడ్డి, శ్రీ ఎస్. రాములు నాయక్, పాల్గొని అర్చక స్వాములు సమర్పించిన వినతి పత్రాలను నేరుగా స్వీకరించారు.ఆధ్యాత్మిక చైతన్యంతో ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన అర్చకులుమావేశం సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆలయ వేదికగా, మంత్రోచ్చారణలు మరియు ఆధ్యాత్మిక చైతన్యం ద్వారా సకల జనులలో స్వరాష్ట్ర కాంక్షను రగిలించడంలో అర్చకులు మరియు గిరిజన అర్చకులు నిర్వహించిన పాత్ర అభినందనీయమని కొనియాడారు.

### అర్చకులు & గిరిజన అర్చకులు లేవనెత్తిన ప్రధాన డిమాండ్లు:

నేటి ముఖాముఖి సంప్రదింపుల్లో పాల్గొన్న అర్చక సమాఖ్య నాయకులు తమ సంక్షేమానికి సంబంధించి క్రింది ప్రధాన అంశాలను కమిటీ దృష్టికి తీసుకు వచ్చారు

ధూప దీప నైవేద్యం (DDN) భత్యం పెంపు:

రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల నిర్వహణను మరింత బలోపేతం చేసేందుకు ధూప దీప నైవేద్యం కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని తక్షణమే పెంచాలని విజ్ఞప్తి చేశారు.

వేద విద్య & పిల్లల ఉచిత విద్య:

అర్చకుల మరియు గిరిజన అర్చకుల పిల్లలకు వేద విద్యతో పాటు నాణ్యమైన సాధారణ విద్యను పూర్తిగా ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

250 గజాల నివాస స్థలం:

నిరుపేద గిరిజన అర్చకులకు, అర్చక కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చేలా 250 గజాల నివాస భూమిని కేటాయించి ఉచిత రిజిస్ట్రేషన్ చేయాలని విన్నవించారు.

ఆరోగ్య భద్రత (హెల్త్ కార్డ్స్):

అర్చక కుటుంబాల అత్యవసర వైద్య అవసరాల నిమిత్తం అపరిమిత ఉచిత వైద్యం అందేలా ప్రత్యేక డిజిటల్ హెల్త్ కార్డులను జారీ చేయాలని ప్రతిపాదించారు.

కమిటీ స్పందన & భరోసా:

కమిటీ సభ్యులు స్పందిస్తూ.. "ధూప దీప నైవేద్యం భత్యం పెంపుదల, ఉచిత వేద విద్య, నివాస స్థలాలు మరియు హెల్త్ కార్డులపై అర్చక స్వాములు కోరిన ప్రతీ డిమాండ్ అత్యంత న్యాయమైనది.

సమాచార పౌర సంబంధాల శాఖ (I&PR) డిజిటల్ రికార్డింగ్ సాక్షిగా ప్రతీ విజ్ఞప్తిని నమోదు చేశాం. ఈ అంశాలన్నింటినీ గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లి సరైన న్యాయం జరిగేలా కమిటీ కృషి చేస్తుంది" అని హామీ ఇచ్చారు.

మీడియా సెల్, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ

అన్ని ప్రముఖ దినపత్రికలు, న్యూస్ ఛానళ్లు మరియు డిజిటల్ మీడియా మాధ్యమాలలో విస్తృత ప్రచురణ/ప్రసారం కొరకు.

# ఉద్రిక్తంగా కాంగ్రెస్ 'చలో లోక్‌భవన్'

(మొదటి పేజీ తరువాయి)

ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నేత మహ్మద్ అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై మంత్రులు, కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేస్తూ, రాహుల్‌గాంధీ అరెస్టును ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించాయి.అదే విధంగా, హనుమకొండలో కూడా ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ ఆందోళనలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు.రాహుల్‌గాంధీతో పాటు విపక్ష నేతల అరెస్టును ప్రజాస్వామ్య విలువలపై దాడిగా పేర్కొన్న కాంగ్రెస్ నాయకులు, దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల్లో భాగంగానే తెలంగాణలో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య సంప్రదాయాలను గౌరవించాలని, ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి.

# అత్యవసర విచారణ కుదరదు

- **లాఠీఛార్జిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు కోరిన పిటిషనర్**

**న్యూఢిల్లీ,వెలుతురు జూలై 20:**



కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన చలో సంసద్ ఆందోళన సందర్భంగా నిరసనకారులపై పోలీసులు చేపట్టిన చర్యలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశాన్ని తక్షణ విచారణకు స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని పిటిషనర్‌కు సూచించింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. నిరసనకారులపై పోలీసులు లాఠీఛార్జి చేసిన వీడియోలు ఉన్నాయని, వాటిని పరిశీలించాలని కోరగా, మాకు వీడియోలు చూసే సమయం లేదు అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కోర్టు సమయాన్ని వృథా చేయకుండా, పిటిషనర్ కూడా తన సమయాన్ని అనవసరంగా ఖర్చు చేయవద్దని సూచించారు.ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ కోరుతూ తొలుత దిల్లీ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా అత్యవసర విచారణకు నిరాకరణ ఎదురైంది. ఈ అంశంలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు వ్యాఖ్యానించడంతో పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.చలో సంసద్ ఆందోళన సందర్భంగా జరిగిన లాఠీఛార్జి, బలప్రయోగంపై కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. పోలీసుల చర్యల వల్ల పలువురు నిరసనకారులు గాయపడ్డారని, ఘటనపై నిష్పాక్షిక విచారణ అవసరమని పిటిషనర్ వాదించారు.కాగా, నీట్ ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీజేపీ దేశ రాజధానిలో 'చలో సంసద్' కార్యక్రమాన్ని నిర్వహించింది. వేలాది మంది మద్దతుదారులు పార్లమెంట్ వైపు ర్యాలీగా కదిలారు.పార్లమెంట్ సమీపంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు నిరసనకారులు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బాష్పవాయు గోళాలు ప్రయోగించడంతో పాటు లాఠీఛార్జి చేశారు. ఈ క్రమంలో పలుచోట్ల తోపులాటలు, రాళ్ల దాడులు చోటుచేసుకున్నాయి. ఘటనలో పోలీసులు, నిరసనకారులు గాయపడగా, రక్తసిక్తంగా ఉన్న పలువురి వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

# తెలంగాణ రెడ్కో డీఈ ఇంట్లో ఏసీబీ...

(మొదటి పేజీ తరువాయి)

డీఎస్పీ మాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో మొత్తం ఎనిమిది ప్రత్యేక బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి.సోదాల సందర్భంగా స్థిర, చరాస్తులకు సంబంధించిన పలు కీలక పత్రాలతో పాటు భారీ మొత్తంలో నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులు, భూములు, ఇతర ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.సోదాలు సాయంత్రం వరకు కొనసాగే అవకాశం ఉందని, తనిఖీలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న ఆస్తులు, నగదు, ఇతర వివరాలతో కూడిన అధికారిక ప్రకటన విడుదల చేస్తామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయి.

# ఎల్ నినో సన్నద్ధతపై రాష్ట్ర నిపుణుల కమిటీ తొలి సమావేశం

**శాస్త్రీయ విశ్లేషణ ఆధారంగా రాష్ట్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందింపు దిశగా చర్చలు**

**హైదరాబాద్, వెలుతురు జూలై 22:**






వాతావరణ మార్పుల ప్రభావం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేయడం, వ్యవసాయం దాని అనుబంధ రంగాల కోసం రాష్ట్ర స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళికను రూపొందించడం, ఉపశమన, అనుసరణ చర్యలను సిఫారసు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 మంది సభ్యులతో కూడిన బహుళ విభాగాల నిపుణుల కమిటీ తొలి సమావేశం బుధవారం ప్రజాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు డా. జి. చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కమిటీలో భారత వాతావరణ శాఖ, ఇక్రిశాట్, ఐసీఏఆర్–క్రిడా, నాబార్డ్, వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య విశ్వవిద్యాలయాలు, భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ, భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ, మార్క్ ఫెడ్, ఆయిల్‌ఫెడ్, జాతీయ విత్తన సంస్థ, తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు సభ్యులుగా ఉన్నారు.ఈ సందర్భంగా డా. జి. చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో అసాధారణ వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. గత ఆరు నెలలుగా ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనాలు ఉన్నప్పటికీ, రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని చాలా మంది భావించారని, అయితే జూన్ 1 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో సగటున సుమారు 30 శాతం వర్షపాత లోటు నమోదైందని, 10 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదుకాగా, 23 జిల్లాల్లో వర్షపాత లోటు ఉందని తెలిపారు.ఎల్ నినో శాస్త్రీయ నేపథ్యాన్ని వివరిస్తూ, పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే కనీసం 0.5 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగి వరుసగా కొన్ని నెలలు కొనసాగితే దానిని ఎల్ నినోగా పరిగణిస్తారని తెలిపారు. ఎల్ నినో–సదర్న్ ఆసిలేషన్ ప్రపంచ వాతావరణ వ్యవస్థను ప్రభావితం చేసే ప్రధాన సహజ చక్రమని పేర్కొన్నారు.ఎల్ నినో పరిస్థితుల్లో వాణిజ్య పవనాలు బలహీనపడటంతో వేడి సముద్ర జలాలు తూర్పు వైపు కదలి నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తాయని, లా నినా పరిస్థితుల్లో సాధారణంగా భారతదేశంలో మెరుగైన వర్షపాతం నమోదవుతుందని వివరించారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావమే రాష్ట్రంలో వర్షపాత లోటుకు ప్రధాన కారణమని తెలిపారు.వర్షపాత లోటు నమోదైన జిల్లాలకు సంబంధించిన జిల్లా, మండలాల వారీ వాతావరణ సమాచారం, వర్షపాతం, పంటల విస్తీర్ణ వివరాలను శాస్త్రీయ విశ్లేషణ, ఆధారిత నిర్ణయాల కోసం సిద్ధం చేసినట్లు తెలిపారు. జూలై 17న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో గౌరవ ముఖ్యమంత్రి ఎల్ నినో ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేసి తగిన ఉపశమన, అనుసరణ చర్యలను సూచించేందుకు ఈ నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.పర్యావరణ అసమతుల్యత చివరికి మానవాళిపైనే ప్రభావం చూపుతుందని పేర్కొన్న డా. చిన్నారెడ్డి, సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ ప్రకృతితో సమన్వయంగా జీవించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఎల్ నినో సవాళ్లు ఉన్నప్పటికీ తెలంగాణ ప్రభుత్వం శాస్త్రీయ విశ్లేషణ, సమగ్ర ప్రణాళిక, సమన్వయ పాలన ద్వారా పరిస్థితులను ఎదుర్కొంటోందని తెలిపారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాల్సిన అవసరాన్ని పేర్కొంటూ ప్రజల్లో అవగాహన, ప్రవర్తనా మార్పు, సామాజిక భాగస్వామ్యం ప్రభుత్వ చర్యలకు బలాన్ని చేకూరుస్తాయని అన్నారు. సమష్టి కృషి, శాస్త్రీయ మార్గదర్శకత్వం, సమన్వయ చర్యలతో రాష్ట్రం ఈ వాతావరణ సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.సమావేశంలో నిపుణులు ఎల్ నినో, లా నినా, సముద్ర ఉపరితల, ఉప ఉపరితల ఉష్ణోగ్రత మార్పులు, ఓషనిక్ నినో ఇండెక్స్, ఇండియన్ ఓషన్ డైపోల్, ప్రపంచ వాతావరణ ప్రసరణ వ్యవస్థలు, వాటి ప్రభావం వర్షపాతం, ఉష్ణోగ్రతలు, కాలానుగుణ వాతావరణ పరిస్థితులపై ఎలా ఉంటుందనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఎల్ నినో, నైరుతి రుతుపవనాల మధ్య చారిత్రక సంబంధం, వర్షపాతం పంపిణీ, వాతావరణ వైవిధ్యం, తెలంగాణలో ఆలస్యమైన రుతుపవనాల ప్రవేశం, మధ్యలో ఏర్పడిన విరామాలు, జిల్లా వారీ వర్షపాతం ధోరణులు, భారత వాతావరణ శాఖ అంచనాలను సమీక్షించారు.వ్యవసాయాన్ని వాతావరణ మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు శాస్త్రీయ పంట ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ, అంతర పంటలు, తక్కువ నీటితో సాగయ్యే, కరువును తట్టుకునే పంటలు, ముఖ్యంగా చిరుధాన్యాల ప్రోత్సాహం, సమర్థవంతమైన నీటి వినియోగం, రైతులకు శాస్త్రీయ సలహాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని కమిటీ నొక్కిచెప్పింది. సమీకృత జల వనరుల నిర్వహణ, నీటి నిల్వ సామర్థ్యాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునర్భరణ, అందుబాటులో ఉన్న నీటి వనరుల సుస్థిర వినియోగంపై కూడా చర్చించింది.నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్ గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో జలాశయాల నిల్వలు, నీటి ప్రవాహాలు, సాగునీటి లభ్యత తెలియజేశారు. అధిక శాతం జలాశయాల్లో నీటి ప్రవాహాలు సాధారణం కంటే చాలా తక్కువగా ఉన్నాయని, తెలంగాణకు వచ్చే నీటి లభ్యతపై ప్రభావం చూపే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో వర్షపాత అంచనాలను నిరంతరం పరిశీలించడం అత్యంత అవసరమని తెలిపారు. తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాశయాల నిర్వహణను అత్యంత జాగ్రత్తగా చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు.ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఇంధనం) నవీన్ మిట్టల్ జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడం, విద్యుత్ డిమాండ్ పెరగడం, గరిష్ఠ వినియోగ సమయాల్లో విద్యుత్ కొరత వంటి సవాళ్లను వివరించారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం, సౌరశక్తి వినియోగాన్ని విస్తరించడం, సమగ్ర ఇంధన ప్రణాళికను అమలు చేయడం అవసరమని సూచించారు. ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి వినయ్ కుమార్ మాట్లాడుతూ, అటవీ ప్రాంతాలు, నదుల పరీవాహక ప్రాంతాలు వాతావరణ స్థిరత్వం, జల భద్రతలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర అత్యవసర కార్యాచరణ ప్రణాళికలో అటవీ శాఖను అంతర్భాగంగా చేర్చాలని సూచించారు. దీర్ఘకాలిక వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత కారణంగా అటవీ వ్యవస్థలు, వన్యప్రాణులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని, తద్వారా మానవ–వన్యప్రాణుల ఘర్షణలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, సామూహిక నీటి సంరక్షణ నిర్మాణాలు, ఉద్యాన పంటల ప్రోత్సాహం వంటి సమన్వయ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వాతావరణ అనుకూలతను పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం అసమానంగా నమోదవుతోందని, వర్షపాతం, భూగర్భ జలాలు, సాగునీటి లభ్యతను సమగ్రంగా విశ్లేషిస్తూ పంటల సరళిలో వచ్చే మార్పులను అంచనా వేస్తున్నామని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టం సుమారు ఒక మీటరు తగ్గిందని చెప్పారు. ఈ ఏడాది వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం ఉండగా, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, కూరగాయలు వంటి తక్కువ నీటి అవసరమున్న పంటల సాగు పెరిగే అవకాశముందని తెలిపారు. రైతులకు జిల్లా వారీగా శాస్త్రీయ పంటల సలహాలు, నిర్వహణ మార్గదర్శకాలను అందిస్తున్నట్లు వివరించారు.భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త డా. స్టెల్లా మాట్లాడుతూ రాబోయే నెలల్లో ఎల్ నినో ప్రభావం మోస్తరు స్థాయి నుంచి తీవ్ర స్థాయికి చేరే అవకాశముందని, ఇండియన్ ఓషన్ డైపోల్ తటస్థంగానే కొనసాగే అవకాశముండటంతో ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. నైరుతి రుతుపవనాల మిగిలిన కాలంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఎల్ నినో ప్రభావం కొనసాగితే వచ్చే వేసవిలో తీవ్ర ఉష్ణోగ్రతలు, నీటి కొరత మరింత పెరిగే అవకాశముందని హెచ్చరించారు.ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఇంధనం) నవీన్ మిట్టల్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ. శ్రీధర్, ప్రధాన ముఖ్య అటవీ సంరక్షణాధికారి వినయ్ కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, భూగర్భ జల విభాగం డైరెక్టర్ కె లక్ష్మ, ఐసీఏఆర్–క్రిడా డైరెక్టర్ డా. వినోద్ కుమార్ సింగ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. అల్దాస్ జనయ్య, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. రాజిరెడ్డి, ప్రొఫెసర్ జ్ఞాన ప్రకాష్, వైస్ ఛాన్సలర్ పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ పటేల్, శాస్త్రవేత్తలు, నిపుణులు, రైతు కమిషన్ సభ్యులు కె.వి.ఎన్.రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పరిశోధనా సంస్థలు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం

- **హైదరాబాద్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) సభ్యులు సురేష్ లాల్ నేతికార్**



**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు సంబంధించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ఏఐసీసీ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ముట్టడికి ప్రయత్నించింది. ప్రధాని నివాసం వద్ద ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ అరెస్టులను నిరసిస్తూ బుధవారం రాష్ట్ర పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి ర్యాలీగా లోక్ భవన్ వరకు చేపట్టిన నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హైదరాబాద్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) సభ్యులు సురేష్ లాల్ నేతికార్ పాల్గొని నీట్ పరీక్ష వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరసనకు మద్దతు తెలిపిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రావు, సాయి నేతికార్ పురుషోత్తమ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇటీవల ప్రమాదంలో మరణించిన మాజీ ఎంపిటిసి ఎలుగు యాదయ్య పార్వతమ్మ ల కుమారుడు సందీప్





**యాదయ్య దంపతులను ఓదారుస్తూ కన్నీరు పెట్టుకున్న రాజగోపాల్ రెడ్డి**

**మోత్కూర్ వెలుతురు జూలై 22:**

మోత్కూరు మండలం దత్తప్ప గూడెంలో ఇటీవల ప్రమాదంలో మరణించిన మాజీ ఎంపిటిసి ఎలుగు యాదయ్య పార్వతమ్మ ల కుమారుడు సందీప్ నివాసానికి చేరుకుని సందీప్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి యాదయ్య పార్వతమ్మ దంపతులను ఓదార్చిన మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి.

యాదయ్య దంపతులను ఓదారుస్తూ కన్నీరు పెట్టుకున్న రాజగోపాల్ రెడ్డి

రాజ్ గోపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ నల్గొండ జిల్లా ఎమ్మెల్సీగా పనిచేసిన కాలం నుండి నాకు యాదయ్య పరిచయం

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా నా అభిమానిగా సుపరిచితుడు

అప్పుడు అధికార పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పుడు ఎదు రొడ్డి నిలబడ్డాడు

సందీప్ చాలా మంచి వ్యక్తి

సందీప్ ప్రమాదంలో చనిపోవడం దురదృష్టకరం

ప్రమాదం జరిగిన మరుక్షణం నుంచే సందీప్ ని బతికించడానికి తీవ్ర ప్రయత్నం చేశాము

సందీప్ మృతి నా కుటుంబ సభ్యుడు కోల్పోయినంత బాధ కలిగించింది

గతంలో కూతురు చనిపోవడం ఇప్పుడు కుమారుడు చనిపోవడం చాలా బాధాకరం

ఆ దంపతుల బాధ వర్ణనాతీతం ఎవరు తీర్చలేనిది

మానవత్వంతో పరామర్శించడానికి వచ్చాను దీంట్లో ఎటువంటి రాజకీయాలు లేవు

కార్యకర్తలు ఎవరు ఆందోళన చెందవద్దు

సొంత కార్యకర్తలపైనే కేసులు పెట్టి వేధించడం సరికాదు

సమన్వయంతో అందరిని కలుపుకొని పోవాలి

# అర్హులైన ప్రతీ ఓటరును కాపాడుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు డివి నాయక్**

**చివ్వెంల, వెలుతురు జులై 22 :**



గ్రామంలో అర్హులైన ప్రతి ఓటరును కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మొదిన్ పురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ సగరపు సునీతప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఓటర్లు ప్రతి ఒక్కరు తమ పూర్తి వివరాలను బిఎల్ఓ వద్ద నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. గ్రామంలో జరుగుతున్న సర్ ప్రక్రియ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి నేత డాక్టర్ ప్రసాద్ సగరపు, కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు నాగమ్మచత్రు నాయక్, మస్తాన్, చీమ వీరయ్య, బోళ్ళ రవీందర్ రెడ్డి, సైదా నాయక్, శ్రీను, పరశురాములు, కన్నం జానయ్య, శంకర్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరి సైదా నాయక్, లక్ష్మణ్, భాస్కర్, చందులాల్, జగ్గు నాయక్, నందా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు: కోలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 22:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, భగత్ సింగ్ నగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ రెడ్డి అకాల మరణం చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం భగత్ సింగ్ నగర్‌లోని నారాయణరెడ్డి నివాసానికి వెళ్లిన కొలన్ హన్మంత్ రెడ్డి, ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. పార్టీ బలోపేతానికి నారాయణరెడ్డి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన అకాల మరణం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నారాయణ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు. ఈకష్ట సమయంలో కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కొలన్ హన్మంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన ఆత్మకు సద్గతి కలగాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు భగత్ సింగ్ నగర్ కాలనీ నివాసితులు పాల్గొని నారాయణ రెడ్డికి నివాళులు అర్పించారు.



# రియల్ ఎస్టేట్ బ్రోకర్ ఇజం తెలివితేటలు చూపిస్తే తగిన బుద్ధి చెబుతా

**కబ్జాదారులను హెచ్చరించిన రైతు చందుపట్ల ధర్మారెడ్డి..**
**చీటింగ్ చేసిన ఎన్నారై వెంచర్ పై చర్యలు తీసుకోవాలి**
**అన్మోల్ అర్బన్ టౌన్స్ వెంచర్లో ఎవరు ఇల్లు కొనవద్దు**
**చీటింగ్ చేసి భూమిని తీసుకొని నిండా ముంచుతున్నారు: భూయజమాని చందుపట్ల ధర్మారెడ్డి**

**ఘట్కేసర్ వెలుతురు జూలై 22:**






మోసం, చీటింగ్, నమ్మకద్రోహం వీటన్నిటికీ కేరాఫ్ ఎన్నారై వెంచర్...అన్మోల్ అర్బన్ టౌన్స్ పేరుతో ప్లాట్లు చేసి అమ్మాలని చూస్తున్న ఎన్ఆర్ఐ వెంచర్ ప్రతినిధులపై మండిపడ్డారు ఎదులాబాద్ రైతు చందుపట్ల ధర్మారెడ్డి. తన భూమిలో గుంతలు ఉన్నాయని పూడ్చివేస్తామని నమ్మబలికి మోసం చేసి గుంతలు పూడ్చిన తర్వాత ఆ గుంతలో సెప్టెన్కో కడుతూ ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరిస్తున్నారని చందుపట్ల ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఘట్కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎదులాబాద్ గ్రామంలో సర్వేనెంబర్ 56 లో తనకు మూడు ఎకరాల భూమి ఉందని... తన భూమి పక్కనే అనుకుని ఉన్న సర్వే నెంబర్లు 41/పి,42/పి, 55/పి, 57/పి, 58/పి సర్వే నెంబర్లలో 137360.37 గజాలలో అన్మోల్ అర్బన్ టౌన్స్ పేరుతో వెంచర్ వేస్తున్న మౌనిక రెడ్డి... నవీన్ అనే వ్యక్తితో నా భూమి లోకి వచ్చి మీ భూమిలో గుంతలు చాలా ఉన్నాయి మట్టిపోసి పూడ్చివేయిస్తామని నమ్మబలికి నేడు నాకు సంబంధించిన భూమిలో వెంచర్ కి సంబంధించిన సెప్టిక్ ట్యాంకు కడుతున్నారని.. ఇదేంటి అని ప్రశ్నిస్తే అని బెదిరిస్తున్నారని చందుపట్ల ధర్మారెడ్డి అన్నారు. తప్పుడు సర్వే నెంబర్లతో భూమి లోకి ఆక్రమించి కోర్టు ను సైతం తప్పుదోవ పట్టిస్తూ ఆర్డర్ తీసుకొచ్చి సెప్టిక్ కట్టడం ఏంటి అని ప్రశ్నించానని.... మా భూమిని ఆక్రమించి వెంచర్ వేసి ఇల్లు అమ్ముకొని వెళ్లిపోతే కొనుక్కున్న బాధితులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపిన కూడా రియల్ ఎస్టేట్, బ్రోకర్ ఇజం తెలివితేటలతో నా భూమిని ఆక్రమించడంతోపాటు ఇండ్లు కొనే వారిని సైతం మోసం చేయాలని చూస్తున్నారని చందుపట్ల ధర్మారెడ్డి అన్నారు. ఘట్కేసర్, ఎదులాబాద్ ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు అర్బన్ టౌన్స్ పేరుతో వేసిన వెంచర్లో ఏమాత్రం ఇండ్లు కొనవద్దని తెలియజేశారు.



# వర్షం వస్తే చాలు.. శంకర్‌పల్లి–వికారాబాద్ రోడ్డు నరకయాతనే!

- **గుంతల రహదారితో ప్రజల ప్రాణాలు గాల్లో**
- **ఆలస్యం.. నిర్లక్ష్యం.. ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్న రహదారి**
- **వెంటనే మరమ్మతులు చేపట్టాలంటూ ప్రజల డిమాండ్**

**ఫతేపూర్ నుంచి లక్ష్మారెడ్డిగూడెం వరకు గుంతలే గుంతలు**

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 22 :**





శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫతేపూర్ వార్డు నుంచి అలంకాన్ మీదుగా మహాలింగాపురం, లక్ష్మారెడ్డిగూడెం వరకు ఉన్న శంకర్‌పల్లి–వికారాబాద్ ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్డు చెరువును తలపిస్తూ గుంతల్లో నీరు నిలిచిపోవడంతో అసలు రహదారి ఎక్కడుందో గుర్తించలేని పరిస్థితి నెలకొంది.ఈ మార్గంలో ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు చేతబట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుంతల లోతు అంచనా వేయలేక పలువురు కిందపడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది.ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత పరిష్కారం చూపడంలో సంబంధిత శాఖలు పూర్తిగా విఫలమయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

**రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలి సంజీవ యువజన నాయకులు ఫతేపూర్ వార్డు**

ఫతేపూర్ వార్డు నుంచి లక్ష్మారెడ్డిగూడెం వరకు ఉన్న ఈ రహదారి తీవ్రంగా దెబ్బతిని ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతాము



సంజీవ యువజన నాయకులు ఫతేపూర్ వార్డు

# న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుష చర్య

- **ప్రజాస్వామిక వాదులంతా ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించాలి.**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**

శాంతియుతంగా ఉద్యమిస్తున్న విద్యార్థులపై పోలీసు దాడులు అత్యంత దుర్మార్గమైన చర్య అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు.ప్రశ్నించే గొంతులను అణచివేయడమే కేంద్ర ప్రభుత్వ విధానంగా ఉందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కు కారకులైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు ప్రశ్నిస్తుంటే దానిని పరిష్కరించకుండా వారిపై దాడులు చేయించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.శాంతియుత నిరసనలను అణచివేసే నిర్బంధ విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని లింగం గౌడ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం రాష్ట్ర నాయకులు గూడూరు భాస్కర్, బీసీ విద్యార్థి సంఘం బండి గారి భరత్ పాల్గొన్నారు.




# ఆగస్టు మూడో వారానికి చెరువుల అభివృద్ధి పనులు పూర్తి కావాలి: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 22:**

మాధాపూర్, ఐటీ కారిడార్ పరిధిలోని తమ్మిడికుంట, సున్నం చెరువుల పునరుద్ధరణ పనులను ఆగస్టు మూడో వారానికల్లా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన, రెండు చెరువుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను, పాత్‌వేలు మరియు ప్రధాన గేట్ల నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఆక్రమణలకు గురై గతంలో 16.4 ఎకరాలకు పరిమితమైన సున్నం చెరువును 30.5 ఎకరాలకు, అలాగే 16.2 ఎకరాలకు పరిమితమైన తమ్మిడికుంటను 29.3 ఎకరాలకు విస్తరించి హైడ్రా పునరుద్ధరణ పనులు చేపడుతోంది. వరద నీరు నేరుగా చెరువుల్లోకి చేరేలా ఇన్‌లెట్లు, అదనపు నీరు బయటకు వెళ్లేందుకు ఔట్‌లెట్లు, అలాగే మురుగునీరు కలవకుండా ఉండేందుకు ఎస్‌టీపీల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు.

వరద కట్టడి, భూగర్భ జలాల పెంపుతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా ఈ పనులు జరుగుతున్నాయని కమిషనర్ తెలిపారు. చెరువుల చుట్టూ బలమైన బండ్, విశాలమైన పాత్‌వేలు, వాకింగ్ ట్రాక్‌లతో పాటు పార్కులు, ఓపెన్ జిమ్‌లు, చిన్నారుల ప్లే ఏరియాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పర్యటనలో హైడ్రా అడిషనల్ కమిషనర్ డి. ఆనంద్‌కుమార్, ఏసీపీ తిరుమల్, విమోస్ టెక్నోక్రాట్స్ ప్రతినిధి యూనస్ తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల సడన్ స్ట్రైక్

- **స్తంభించిన డెలివరీలు, అమాంతం పెరిగిన క్యాబ్ ఛార్జీలు!**
- **డిమాండ్లు నెరవేర్చకపోతే ఆగస్టు 8 నుంచి నిరవధిక సమ్మె!**

**హైదరాబాద్:**




రాష్ట్రవ్యాప్తంగా గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికులు చేపట్టిన మెరుపు సమ్మెతో బుధవారం హైదరాబాద్ నగరంలో సేవలన్నీ ఒక్కసారిగా స్తంభించిపోయాయి. ప్రధానంగా మధ్యాహ్నం భోజన సమయంలో ఈ సమ్మె ప్రభావం తీవ్రంగా కనిపించింది. స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్ వంటి సంస్థల్లో పనిచేసే డెలివరీ బాయ్స్ మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 2:00 గంటల వరకు సేవలను పూర్తిగా నిలిపివేశారు. వర్షం కురుస్తున్న సమయంలో ఆర్డర్లు ఎక్కువగా వచ్చే సమయాన డెలివరీలు బంద్ కావడంతో అటు వినియోగదారులు, ఇటు హోటల్ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సమ్మెలో భాగంగా ఓలా, ఊబర్, రాపిడో, స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్ సంస్థలకు చెందిన క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, గూడ్స్ ట్రాన్స్‌పోర్టర్లు, డెలివరీ బాయ్స్ పాల్గొన్నారు. యూనియన్ నాయకులు నేరుగా సప్లై గోదాముల వద్దకు వెళ్లి కార్మికులను సమ్మెలో భాగస్వాములను చేశారు. క్యాబ్‌లు, ఆటోలు అందుబాటులో లేకపోవడంతో యాప్‌లలో సూర్జ్ ప్రైసింగ్ అమాంతం పెరిగింది. విప్రో సర్కిల్ వద్ద ఓ ఐటీ ఉద్యోగి మాట్లాడుతూ.. సాధారణంగా రూ. 150 అయ్యే ఆటో ప్రయాణానికి క్యాబ్‌లో ఏకంగా రూ. 600 వసూలు చేశారని వాపోయారు.

గిగ్ కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని, కార్మికుల రేట్ కార్డులను సవరించాలని, అగ్రిగేటర్ గైడ్‌లైన్స్‌ను కచ్చితంగా అమలు చేయడంతో పాటు మోటార్ వాహనాల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వం, సంబంధిత యాజమాన్యాలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆగస్టు 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు.

# రెన్యూవబుల్ ఎనర్జీ డీఈ ఇళ్లపై ఏసీబీ దాడులు

- **వందల కోట్ల అక్రమాస్తుల చిట్టా రట్టు**
- **అవినీతి అధికారులపై బిగుస్తున్న ఏసీబీ ఉచ్చు**
- **ఏడాది కాలంగా ఆదాయానికి మించిన ఆస్తులపై నిఘా**
- **హైదరాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఏకకాలంలో తనిఖీలు**
- **10 ప్రాంతాల్లో జల్లెడ పట్టిన అవినీతి నిరోధక శాఖ**
- **అధికారి భార్య పేరిట భారీగా అపార్ట్‌మెంట్లు, బిల్డింగ్స్**
- **బహిర్గతమైన విలాసవంతమైన ప్లాట్ల వివరాలు**

**హైదరాబాద్, వెలుతురు, జూలై 22:**

తెలంగాణ రాష్ట్రంలో లంచగొండి, అవినీతి అధికారుల ఆట కట్టించేందుకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కఠిన చర్యలు చేపట్టింది. గత ఏడాది కాలంగా అక్రమ మార్గాల్లో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన పలువురు ప్రభుత్వ అధికారులపై ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా నిఘా పెట్టారు. అందులో భాగంగా వరుసగా దాడులు నిర్వహిస్తూ భారీ మొత్తంలో అక్రమ సొత్తును బయటకు తీస్తున్నారు. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని వివిధ శాఖల్లో కీలక పదవుల్లో ఉంటూ అక్రమాలకు పాల్పడిన అధికారుల ఆస్తుల చిట్టా రట్టవుతుండటం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో ఇంజనీరింగ్, రెవెన్యూ, పోలీస్ వంటి వివిధ శాఖల్లో తనిఖీలు చేపట్టిన ఏసీబీ, పలువురి నుంచి వందల కోట్ల రూపాయల విలువైన ఆస్తుల



# ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణ

- **సోమవారానికి వాయిదా**
- **కేసు వివరాలు సమర్పించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం**
- **తదుపరి చర్యలు నిలిపివేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ధర్మాసనం**
- **తప్పుడు కేసు పెట్టారని.. కేసు కొట్టివేయాలని ట్రైనీ ఐపీఎస్ పిటిషన్**



ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ సందర్భంగా కేసు పురోగతిపై నివేదిక సమర్పించాలని సూచించింది.విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రస్తుతం ట్రైనీ ఐపీఎస్ అధికారిగా ఉన్నందున, విచారణ పూర్తయ్యే వరకు ఆయనపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని కోర్టును కోరారు. అయితే, ఈ దశలో అలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది.ఉదయ్ కృష్ణారెడ్డిపై నమోదైన కేసు తప్పుడు ఆరోపణల ఆధారంగా పెట్టిందని, చట్టపరమైన ఆధారాలు లేవని పేర్కొంటూ ఆ కేసును కొట్టివేయాలని ఆయన పిటిషన్‌లో కోరారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను సోమవారానికి వాయిదా వేసింది.కాగా, తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధించడంతో పాటు వ్యక్తిగత వీడియోలను తన భర్తకు పంపించి మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నీట్ రద్దుతోనే సమస్యకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

- **రాహుల్ గాంధీ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించిన విజయ్**
- **ఢిల్లీ ఆందోళనలకు టీవీకే పార్టీ సంపూర్ణ మద్దతు**
- **వైద్య విద్యను 'రాష్ట్ర జాబితా'లోకి మార్చడమే పరిష్కారం**
- **విద్యా విధానంపై తమిళనాడు సీఎం కీలక ప్రతిపాదనలు**

**చెన్నై, వెలుతురు, జూలై 22:**

దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తున్న నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై తమిళనాడు ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అక్రమాల వల్ల దేశంలోని లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి విద్యార్థులు, ప్రజల మనోభావాలను గౌరవించాలని, నీట్ పరీక్షను శాశ్వతంగా రద్దు చేయడమే ఈ సమస్యకు ఏకైక మార్గమని స్పష్టం చేశారు.నీట్ అక్రమాలకు నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలో నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇతర ప్రజాప్రతినిధులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తమిళనాడు సీఎం విజయ్ తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, విపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో న్యాయం కోసం పోరాడుతున్న ప్రతిపక్షాల ఆందోళనలకు తమ పార్టీ తరపున సంపూర్ణ నైతిక మద్దతు ఉంటుందని ఆయన ప్రకటించారు.నీట్ వంటి కేంద్రీకృత పరీక్షల రుగ్మత నుంచి దేశ విద్యార్థులకు విముక్తి లభించాలంటే విద్యా రంగాన్ని కేంద్ర ఆధిపత్యం నుంచి తప్పించాలని విజయ్ అభిప్రాయపడ్డారు. విద్యను, ముఖ్యంగా వైద్య విద్యను తిరిగి రాజ్యాంగంలోని 'రాష్ట్ర జాబితా' పరిధిలోకి చేర్చడమే ఈ రుగ్మతలకు ఏకైక శాశ్వత పరిష్కారమని ఆయన కుండబద్దలు కొట్టారు. రాష్ట్రాల విద్యా అవసరాలు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే అధికారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలని స్పష్టం చేశారు.విద్యను రాష్ట్ర జాబితాలోకి మార్చడానికి ఏవైనా చట్టపరమైన, విధానపరమైన లేదా రాజ్యాంగబద్ధమైన అడ్డంకులు ఉంటే, దానికి ప్రత్యామ్నాయంగా ఒక 'ప్రత్యేక ఉమ్మడి జాబితా'ను రూపొందించాలని సీఎం విజయ్ సూచించారు. ఈ మధ్యంతర చర్య ద్వారా సాధారణ విద్యతో పాటు వైద్య విద్యపై కూడా రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్ణయాధికారం కల్పించవచ్చని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సమయం నుంచే ఈ విధానాన్ని స్పష్టంగా బలంగా వినిపిస్తున్నామని, తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తు కోసం ఈ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.మరోవైపు నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గత కొన్ని రోజులుగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తీవ్రస్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తోంది. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది మద్దతుదారులు ఢిల్లీ వీధుల్లో ఆందోళనకు దిగారు.పరీక్షల నిర్వహణలో అక్రమాలపై జంతర్‌మంతర్ వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ పర్యావరణ వేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను ఢిల్లీ పోలీసులు బలవంతంగా ఆస్పత్రికి తరలించడంతో నిరసనల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఈ చర్యతో ఆగ్రహించిన సీజేపీ నాయకత్వం 'సంసద్ చలో' (పార్లమెంట్ ముట్టడి)కి పిలుపునిచ్చింది. ఈ పిలుపుతో ఒక్కసారిగా దేశం నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు, యువకులు ఢిల్లీకి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.పార్లమెంట్ వైపు దూసుకుపోతున్న వేలాది మంది నిరసనకారులను నిరోధించేందుకు ఢిల్లీ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటుకుని వెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారు. దీంతో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. గుంపును చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించడంతో పాటు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు, నిరసనకారులతో పాటు పోలీసులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. రక్తం చిందిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో దేశవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు వ్యక్తమయ్యాయి.నిరసనలు ఉగ్రరూపం దాల్చడం, విపక్షాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. సీజేపీ ప్రతినిధి బృందంతో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. ఈ సమావేశంలో తమ డిమాండ్లపై కేంద్రం నుంచి సానుకూల స్పందన వచ్చిందని సీజేపీ ప్రతినిధులు తెలిపారు. ఇదే సమయంలో తీవ్ర వివాదాస్పదమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో అత్యవసరంగా భేటీ అయ్యారు. మంత్రి రాజీనామా మరియు నీట్ వివాదంపై వీరిద్దరి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినప్పటికీ, భేటీ వివరాలను అధికారికంగా వెల్లడించలేదు.



# ఢిల్లీలో 16 మెట్రో స్టేషన్లు తాత్కాలిక మూసివేత

- **భద్రతా కారణాలతో డీఎంఆర్‌సీ కీలక నిర్ణయం**
- **తదుపరి ఆదేశాలు వచ్చే వరకు పలు స్టేషన్లలో సేవలు నిలిపివేత**
- **రాజీవ్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, మండీ హౌస్‌లో ఇంటర్‌ఛేంజ్ సేవలు కొనసాగింపు**

**న్యూఢిల్లీ,వెలుతురు జూలై 20:**



భద్రతా కారణాల దృష్ట్యా ఢిల్లీలోని 16 మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ప్రకటించింది. బుధవారం ఉదయం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా స్టేషన్లలో ప్రయాణికుల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది.మూసివేసిన స్టేషన్లలో రాజీవ్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, మండీ హౌస్, ఐటీఓ, ఖాన్ మార్కెట్, లోక్ కల్యాణ్ మార్గ్, పటేల్ చౌక్, రామకృష్ణ ఆశ్రమ్ మార్గ్, బరాఖంబా రోడ్, సుప్రీంకోర్టు, సేవా తీర్థ్, జన్‌పథ్, ఢిల్లీ గేట్, ఇంద్రప్రస్థ, జోర్ బాగ్, శివాజీ స్టేడియం మెట్రో స్టేషన్లు ఉన్నాయి.అయితే, రాజీవ్ చౌక్, సెంట్రల్ సెక్రటేరియట్, మండీ హౌస్ స్టేషన్లలో ఇంటర్‌ఛేంజ్ సౌకర్యం మాత్రం యథావిధిగా కొనసాగుతుందని డీఎంఆర్‌సీ స్పష్టం చేసింది. ప్రయాణికులు ఆయా స్టేషన్లలో రైళ్లు మారేందుకు మాత్రమే అనుమతి ఉంటుందని, స్టేషన్ వెలుపలికి వెళ్లడం లేదా అక్కడి నుంచి మెట్రో ఎక్కడం తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపింది.ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన కార్యక్రమాల నేపథ్యంలో భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా కూడా పలు మెట్రో స్టేషన్లను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు.తాజా నిర్ణయంతో కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇతర అవసరాల కోసం మెట్రోపై ఆధారపడే వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, భద్రతా పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత స్టేషన్లను తిరిగి తెరిచే అంశంపై నిర్ణయం తీసుకుంటామని డీఎంఆర్‌సీ పేర్కొంది.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో మోదీ అమిత్ షా దిష్టి బొమ్మలు దహనం

- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూలై 22:**



ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సహా పార్టీ అగ్రనేతల అరెస్టును నిరసిస్తూ ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు ఇబ్రహీంప ట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి గారి నేతృత్వంలో నియోజకవర్గంలోని పార్టీ నాయ కులు కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చినిరసన ర్యాలీ నిర్వహించారు అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ప్రధానిమోదీ హోంమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు ఈసందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ దేశచరిత్రలో ఏనాటి చోటుచేసుకోని పరిణామాలు నేడు చూస్తున్నామన్నారు లక్షలాది మంది జీవితాలతో చెలగాటమాడేలా ప్రశ్నాపత్రాల విష యంలో నిర్లక్ష్యధోరణి ప్రదర్శించటమే కాకుండా ప్రశ్నించిన వారిని అక్రమఅరెస్టులతో అణిచివే యాలని చూడటం దారుణమన్నారు స్వాతంత్ర్యోద్యమ కాలంనుంచి నేటివరకు గాంధీ కుటుం బం ఎన్నోత్యాగాలను చేసిందన్న మల్ రెడ్డి బ్రిటిష్ పాలన మాదిరిగానే నేడు పరిస్థితి మారింద ని ఆరోపించారు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని రాబోయేది కాంగ్రెస్ ప్ర భుత్వమేనని చెప్పారు కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ మం డల అధ్యక్షులు గ్రామశాఖ అధ్యక్షులు పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తు న పాల్గొన్నారు.

# అమిత్ షా పొగబెట్టారు. పాములు బిలం లోంచీ ఒక్కొక్కటీ బయటకు వస్తున్నాయి....

## విదేశాల నుంచి నిధులు తెచ్చుకునే NGOలకు మన అమిత్ షా గారు కొన్ని కొత్త నిబంధనలు తెచ్చారు

1) అన్ని NGO లు - తమ బ్యాంకు అకౌంటుని ఢిల్లీలో SBI లోనే ఉంచాలి.

2) ఆ NGO లు ముందుగా Home Ministry నుంచి అనుమతి పొందాలి

3) ఆ అనుమతి పొందిన తర్వాతే బ్యాంకు అకౌంటుని తెరవబడుతుంది

4) తద్వారా - హోం మినిస్ట్రీ ఎవడెవడికి ఎంతెంత విదేశీ ధనం ఒచ్చిందో తెలిసిపోతుంది.

5) లేకపోతే, దేశవ్యాప్తంగా ఉన్న 14 లక్షల పైగా NGO లు ఎన్నో వేల బ్యాంకుల్లో ప్రభుత్వానికి తమ అకౌంట్లలో జరిగే ట్రాన్సాక్షన్లపై ఆడిట్ వివరాలను సాలీనా తెలుపకుండా సంవత్సరాల పాటు కొనసాగించడం ఇకపై కుదరదు.

ఒకే బ్యాంకు లో అకౌంట్ నడపమనడం రాజ్యాంగ విరుద్ధం అని ఒక బట్టకాయ్ కిర్సస్తానీ NGO పిటీషన్ వేసింది....

31 లక్షల NGO లు ఉన్నాయి దేశవ్యాప్తంగా!

- మన దేశంలోని అన్ని విద్యాలయాల కన్నా రెండు రెట్లు ఉన్నాయి NGO లు.
- మన దేశంలో హాస్పిటల్స్ సంఖ్య కన్నా 250 రెట్లు ఉన్నాయి. దేశంలోని ప్రతి 400 మందికి ఒక NGO ఉంది.
- మన దేశంలోని ప్రతీ 709 మందికి ఒక పోలీసు ఉన్నాడు.

ఈ లెక్కలు అన్నీ CBI అన్నీ రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల నుండి అధికారికంగా సేకరించినవే.


31 లక్షల NGO లు సొసైటీస్ ఆఫ్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద రిజిస్టర్ చేసినవే.

సుప్రీం కోర్ట్ ఆదేశాల ప్రకారం:

- అసలు దేశంలో ఎన్ని NGO లు ఉన్నాయి?
- అవి ఆదాయ-వ్యయ వివరాలు ఇస్తున్నాయా?
- బాలెన్స్ షీట్స్ సంగతి ఏమిటి?
- ఇవన్నీ సమగ్రంగా సేకరించి తమ ముందు ఉంచాలని సుప్రీం కోర్ట్ CBI ని ఆదేశిస్తే సేకరించిన వివరాలు ఇవి.
- అక్టోబర్ 1 వ తేదీన CBI ఈ వివారాలు సుప్రీం కోర్ట్ కి ఇచ్చింది. అయితే ఈ లెక్కలు ఇంకా పూర్తిగా రాలేదు.

CBI సుప్రీం కోర్టు కి ఇచ్చిన అఫడవిట్ ప్రకారం:

- మొత్తం 26 రాష్ట్రాలు ఇచ్చిన వివరాలు మాత్రమే. ఇంకా కర్ణాటక, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాలు వివరాలు ఇవ్వాల్సి ఉంది. అంటే ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.
- 7 కేంద్ర పాలిత ప్రాంతాలలో 82,000 NGO లు ఉన్నాయి.
- 2011 లో ప్లానింగ్ కమిషన్ దగ్గర ఉన్న వివరాల ప్రకారం 15 లక్షల విద్యాలయాలు [ప్రాథమిక, హైస్కూల్ కలిపి] ఉన్నట్లు ప్రకటించింది. ఈ తొమ్మిదేళ్లలో వీటి సంఖ్య ఇంకా పెరిగి ఉండవచ్చు.
- మార్చ్ 2011 నాటికి దేశంలో 11,993 హాస్పిటల్స్ ఉన్నాయి. వీటిలో పడకల సంఖ్య 7 లక్షల 84 వేలు.
- వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న హాస్పిటల్స్ సంఖ్య 7,347. వీటిలోని పడకల సంఖ్య లక్షా 60 వేలు.
- అలాగే పట్టణ ప్రాంతాల్లో ఉన్న హాస్పిటల్స్ సంఖ్య 4,146.
- వీటి పడకల సంఖ్య 6 లక్షల 18 వేలు.
- మన దేశంలో ఉన్న పోలీసుల కంటే NGO లు ఎక్కువ ఉన్నాయి.
- ఉత్తర ప్రదేశ్ లో ఎక్కువగా 5.48 లక్షల NGO లు ఉన్నాయి.
- తరువాతి స్థానంలో మహారాష్ట్ర 5.18 లక్షల NGO లు,
- మూడో స్థానంలో కేరళ 3.7 లక్షల NGO లు ఉన్నాయి.



- వెస్ట్ బెంగాల్ లో 2.34 లక్షల NGO లు ఉన్నాయి.
- కేంద్ర పాలిత ప్రాంతాల్లో అన్నిటికన్నా ఎక్కువ ఢిల్లీ లో 76,000 NGOs ఉన్నాయి.
- 10% కన్నా తక్కువగా NGO లు ఆదాయ-వ్యయ వివరాలు ఇచ్చాయి రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్ కి.
- అంటే మొత్తం 31 లక్షల ఎన్‌జిఒ లలో 2 లక్షల 9వేల NGO లు మాత్రమే లెక్కలు ఇచ్చాయి.
- అంటే 29 లక్షల NGO లు అసలు లెక్కలు ఇవ్వలేదు ఇప్పటిదాకా.
- ఈ సంఖ్యలో కర్నాటక, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాల లెక్కలు లేవు.
- కేరళలో ఉన్న NGO ల సంఖ్య 3 లక్షల 70 వేలు.
- అయితే వీటిలో ఏ ఒక్కటీ కూడా లెక్కలు చూపలేదు.
- విద్యలో మొదటి స్థానం అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కేరళది మొదటి స్థానం అయితే, ఈ 3 లక్షల 70 వేల NGO లు లాభాపేక్ష లేకుండా ఎవరికి సేవ చేస్తున్నాయి?
- దరిద్రం ఏమిటంటే NGO లు లెక్కలు తప్పనిసరిగా చూపించాలి అని నిబంధనలు లేని రాష్ట్రాలు చాలానే ఉన్నాయి.
- విదేశాల నుండి వచ్చే నిధులు ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయి? సింపుల్. దేశ విద్రోహ చర్యలకి, రాజకీయ పార్టీలకి లోకల్ ఫండింగ్ ఏజెన్సీలుగా అలాగే మత మార్పిడులకి ఉపయోగపడుతున్నాయి. ఇదో విష వలయం. ఒకదానితో ఇంకోటి రహస్యంగా సంబంధాలు ఉంటాయి. కానీ బయటికి తెలియకుండా చాలా జాగ్రత్తగా ఉంటాయి.
- పైగా వీటికి ఇచ్చే విరాళాలకి ఆదాయపన్ను మినహాయింపు ఒకటి!

వారం క్రితం కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ కొత్తగా ఒక నిబంధన అములులోకి తెచ్చింది.

ఏదయినా NGO దేశంలో ఎక్కడ ఉన్నా సరే వాటి బాంక్ అక్కౌంట్ ని తప్పని సరిగా ఢిల్లీ లోని State Bank of India శాఖలో తెరవాలి. ఏ విరాళం అయినా ఢిల్లీ లోని SBI శాఖలోనే జమ చేయాలి. అక్కడి నుండే డబ్బుని ఖర్చు చేయాలి.

- ఇది దేశంలో ఉన్న NGO లకి మింగుడు పడట్లేదు. అంటే ఏ NGO అయినా వాటికి వచ్చే పోయే డబ్బు ఒకే బాంక్ శాఖలో ఉంటే మొత్తం బండారం బయట పడి పోతుంది.
- కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ తెచ్చిన కొత్త రూల్ ప్రకారం అయితే తమ వ్యాపారం నడపలేమని 'ఆమ్నేస్టీ ఇంటెర్నేషనల్' తమ దుకాణం మూసేసింది. పైగా ప్రభుత్వం తమని ఇబ్బందులు పెడుతున్నది అని వాపోతున్నది. లెక్కలు అడిగితే ఇబ్బందులు పెట్టినట్లా?
- అసలు Amensty International అనే మానవ హక్కుల సంస్థకి పాలన పరమయిన అనుమతులు లేవని మొన్ననే కేంద్ర హోమ్ శాఖ అధికారికంగా వెల్లడించింది. అసలు కారణం ఏమిటంటే సుప్రీం కోర్టు CBI ని NGO ల వివరాలు సేకరించి ఇవ్వమని ఆదేశాలు ఇవ్వడం ఒకటయితే ఢిల్లీ లోని SBI శాఖలోనే తమ లావాదేవీలు నడపాలి అన్నది రెండో కారణం ఈ మానవ కుక్కల సంఘం తమ దుకాణం మూసేయడానికి.
- అల్ జీలకర్ర చానెల్ వాడు భారత్ లోని హిందూ ఫాసిస్ట్ ప్రభుత్వం ఆమ్నెస్టీ అనే మానవ హక్కుల సంఘాన్ని బలవంతంగా మూసేయించింది అంటూ తప్పుడు కథనాలు ప్రసారం చేసింది. కానీ దానికి అనుమతులు లేవు అని కానీ, అలాగే ఆదాయ-వ్యయ లెక్కలు చూపడం లేదనీ చెప్పదు.
- ఎప్పుడయితే ఆమ్నేస్టీ మూత పడిందో వెంటనే దేశవ్యాప్తంగా మానభంగాలు జరగడం ఎక్కువ అవుతున్నాయి!




- ఎక్కడో లింక్ మిస్ అవుతున్నట్లు లేదూ? రాహువు, ప్రియాంకా వాద్రాకి కావల్సినంత కాలక్షేపం పాపం ఢిల్లీ లోనే తమ ప్రభుత్వ హయాంలోనే అభయ మానభంగం, హత్య జరిగిందన్న స్పృహ లేదు వీళ్ళకి.
- అఫ్కోర్స్ అప్పట్లో Enough is Enough అంటూ NDTV బుర్ఖా దత్ నేతృత్వం లో ఓ భారీ కొవ్వొత్తుల ప్రదర్శన చేసి అంతటితో అంతా బాగు పడిపోయింది అనే నాటకం ఇంకా ప్రజల మనస్సులో నుండి పోలేదన్న సంగతి రాహువు కి తెలియదా?
- అసలు "ఈ ఆమ్నెస్టీ సంస్థని 2009 లో అప్పటి మన్మోహన్ ప్రభుత్వం మూసేయమని ఆర్డర్ చేసిన సంగతి" ఏ మీడియా ఎందుకు చెప్పదు?
- దాదాపుగా మూసేసినంత పని జరిగాకా లోపల లోపల ఏం జరిగిందో కానీ మళ్ళీ యధాతథంగా పనిచేయడం మొదలుపెట్టింది ఈ ఆమ్నెస్టీ సంఘం.

మనం ధన్యవాదాలు తెలపాల్సింది ఢిల్లీకి చెందిన అడ్వకేట్ శ్రీ M L Sharma గారికి.

- దేశ వ్యాప్తంగా ఉన్న NGO ల అక్రమాల మీద విచారణ చేయమని 'ప్రజా ప్రాయోజన వ్యాజ్యం' [PIL] వేశారు. దాని మీద విచారణ చేయమని సుప్రీం కోర్టు CBI ని ఆదేశించింది. ఇప్పుడు తీగ లాగితే డొంక అంతా కదులుతున్నది. అందుకే తమ ఆదాయాలు పోతున్నాయనే అక్కసుతో నోటి నుండి అశుద్ధం కక్కుతున్నారు కొందరు.
- ఇక ఇమ్రాన్ ఖాన్ ఐక్యరాజ్య సమితి లో భారత్ మానవ హక్కులని అణిచివేస్తున్నది అంటూ విషం కక్కుతాడు చూడండి. ఎవరి లింకులు ఎక్కడనుండి ఎక్కడికి ఉన్నాయో మొత్తం వివరాలు CBI రెండు వారాల్లో లెక్కలతో సహా రెండో అఫడవిట్ లో ఇస్తామని సుప్రీం కోర్టుకి తెలిపింది. ఇది సుప్రీం కోర్ట్ పర్యవేక్షణలో దర్యాప్తు జరుగుతున్నది కాబట్టి "పూర్తి వివరాలు ఇవ్వలేమని కానీ, అలాగే అబద్ధపు సమాచారం కానీ" ఇవ్వలేవు ఏ రాష్ట్రం కూడా.
- ఉన్న డబ్బులు అయిపోయే దాకా అరుస్తారు. తరువాత అన్నీ మూసుకొని కూర్చుంటారు. ఎందుకంటే కొత్తగా విరాళాలు వచ్చే దారులు మూసుకుపోతున్నాయి కదా!
- చెడు చేయాలంటే ఒక్క క్షణం చాలు అదే మంచి చేయాలంటే చాలా కాలం పడుతుంది. మంచి కోసం వేచి చూద్దాము.a

# బిఆర్ఎస్ పాలనలో ప్రజల గోడు వినేవారే లేరు

హైదరాబాద్ వెలుతురు జూలై 22:-

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పాలకులకు ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి అవకాశం ఉండేదికాదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంత్రుల కూడా ప్రజలకు అందుబాటులో ఉండేవారుకాదని అన్నారు.

బుధవారం నాడు గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రిగారు పాల్గొని ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గాంధీ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మంత్రిగారు మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి సూచనల మేరకు ప్రతివారం క్యాబినెట్‌లో ఒక మంత్రి ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తు వీలైనంతవరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈరోజు నిర్వహించిన ముఖాముఖిలో చాలా వరకు ఇండ్ల గురించి దరఖాస్తులు వచ్చాయన్నారు. పేదవారి ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం ఈ ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ ప్రభుత్వంలోనే తమ సొంతింటి కల నెరవేతుందనే ఆశతో ప్రజలు ఉన్నారు. వారి ఆశలకు అనుగుణంగా తమ ప్రభుత్వం మొదటి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలు మొత్తం 7 లక్షల ఇండ్లను మంజూరు చేసిందన్నారు. గడచిన పది సంవత్సరాలలో ఆనాటి ప్రభుత్వం పేదలకు అరకొరగా నగరానికి 30–40 కిలోమీటర్ల దూరంలో ఇండ్లు నిర్మించిందని ఫలితంగా తమ జీవనోపాధి దెబ్బతింటుందన్న ఆందోళనతో పేదలు ఆ ఇళ్లల్లో అడుగుకూడా పెట్టలేదన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా పేదవాడు పుట్టి పెరిగిన చోటే నివాసం కల్పించాలన్న ఆలోచనతో నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు నిర్మించబోయే ఇండ్ల విలువ 40 నుంచి కోటి రూపాయిల వరకు ఉంటుందని ఇంటిస్థలంలో వాటా కూడా కల్పిస్తున్నామని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్‌గా 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈ ఇండ్ల కోసం మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్ ద్వారా మరో సారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కరించగలగిన అన్నింటికీ పరిష్కారం చూపిస్తామన్నారు. దేశంలో యువతను దెబ్బతీసిన నీట్ పరీక్ష లీకేజీపై శాంతియుతంగా ఢిల్లీలో ధర్నా చేస్తున్న యువతపైన, మద్దతు తెలిపిన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలపై లాఠీఛార్జి చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు సమాధానం చెప్పలేక పార్లమెంటును పలుమార్లు వాయిదా వేయడం, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ చేతకానితనాన్ని ఎత్తిచూపుతుందన్నారు. తక్షణమే ప్రధాని మోదీ, మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎఐసిసి పిలుపు మేరకు ఈరోజు హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించామని, నీట్ పరీక్ష రాసిన 22 లక్షల మంది అభ్యర్ధులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com